RNI-TGBIL/25/A1275

ప్రజా తెలుగు శక్తి

www.prajatelugushakthi.com

TELUGU DAILY

TV15

A Voice Of Truth.....

సంపుటి (Volume) :01 సంచిక (Issue) :259 ఎడిటర్ : SDతాజ్ బాబా పేజీలు : 08, వెల. 5రూ/ గురువారం-05- అక్టోబర్ - 2026

డీఎస్సీ అభ్యర్థులకు గుడ్‌న్యూస్.. 2,721 పోస్టులతో నోటిఫికేషన్ జారీకి ఛాన్స్



డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఈ రోజు (బుధవారం) రాత్రికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసే ఛాన్స్ ఉంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2 వేల 721 పోస్టులతో రెండో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు సమాచారం.

అమరావతి, నవంబరు 4 : డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఈ రోజు (బుధవారం) రాత్రికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసే ఛాన్స్ ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2 వేల 721 పోస్టులతో రెండో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు సమాచారం. గత నెల 13వ తేదీన సార్ట్ నోటిఫికేషన్‌ను సీఎం చంద్రబాబు సర్కార్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ రోజు రాత్రికి పూర్తిస్థాయి నోటిఫికేషన్ ఇచ్చేందుకు విద్యాశాఖ సిద్ధం అవుతోంది. ఇవాళ నోటిఫికేషన్‌లో దరఖాస్తుల మిగతా..2లో

మహిళా కండక్టర్ ప్రవళిక మృతి.. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవన్న మంత్రి పొన్నం



ప్రయాణికురాలితో గొడవలో గాయపడ్డ కండక్టర్ ప్రవళిక మృతి

పది రోజులుగా హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత

కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ

హైదరాబాద్:ప్రయాణికురాలితో జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న టీఎస్ఆర్టీసీ మణుగూరు డిపో మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక (24) మృతి చెందారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పది రోజులుగా చికిత్స పొందుతున్న ఆమె, నిన్న రాత్రి తుదిశ్వాస విడిచారు. ఈ ఘటనపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రవళిక మరణం తనను తీవ్రంగా కలచివేసిందని మంత్రి అన్నారు. "ప్రవళిక కోలుకుని తిరిగి వస్తుందని ఆశించాం. కానీ ఆమె మృతి చెందడం చాలా బాధాకరం. ఆమె కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ అండగా ఉంటుంది. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం" అని ఆయన స్పష్టం చేశారు. మిగతా..2లో

పోలవరం-బనకచర్ల లింక్‌పై రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి



- చంద్రబాబుకు రేవంత్ రెడ్డి గురుదక్షిణ ఇస్తున్నారన్న కవిత
- నదీ జలాల వినియోగంపై ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని విమర్శ
- పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని సూచన

హైదరాబాద్: పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదీ జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని,

తెలంగాణ ప్రగతిలో యాదవుల భాగస్వామ్యం అవసరం

- యాదవులు కొరగానే తమ ప్రభుత్వం సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.
- ఇది యాదవులకే కాదని.. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికి ఆత్మగౌరవ సమ్మేళనమని పేర్కొన్నారు.



హైదరాబాద్, నవంబరు 4 : యాదవులు కొరగానే తమ ప్రభుత్వం సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇది యాదవులకే కాదని.. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికి ఆత్మగౌరవ సమ్మేళనమని పేర్కొన్నారు. యాదవ సోదరులందరికీ సదర్ సమ్మేళన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో (బుధవారం) హైదరాబాద్ స్టేడియంలో శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. యాదవ సోదరుల ఆత్మగౌరవానికి ఎక్కడా లోటు లేకుండా చూసే బాధ్యత తమదని మాటిచ్చారు.

భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తాం..

దేశంలో తెలంగాణను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలబెట్టాలనేదే మిగతా..2లో

తెలంగాణను గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



- తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.
- రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో డీప్‌టెక్, సాంకేతిక ఆవిష్కరణలు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

హైదరాబాద్, నవంబరు 4: తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మిగతా..2లో

ప్రధాని మోదీ 'దేశద్రోహి'

అని ఐదు నిమిషాల్లోనే నిరూపిస్తా

- ఏడాదిలోపే ప్రభుత్వం కూలిపోతుందని రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు.
- పంజాబ్ లోని ఆమ్ ఆద్మీ ప్రభుత్వం డ్రగ్స్‌ను నిర్మూలించలేదని దుయ్యబట్టారు.



ఢిల్లి: కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశద్రోహి అని, ఆయన్ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నియంత్రిస్తున్నారని, తనతో చర్చకు వస్తే ఆ విషయాన్ని 5 నిమిషాల్లో నిరూపిస్తానని అన్నారు. ఈ అంశంపై చర్చకు రావాలని ప్రధానికి సవాల్ విసిరితే పార్లమెంటులో చర్చిద్దామని ఎన్డీయే నేతలు అంటున్నారని చెప్పారు. కానీ లోక్‌సభలో తాను మాట్లాడకుండా మైక్ కట్ చేస్తారని రాహుల్ తెలిపారు. దేశంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు షా మూడు సంవత్సరాల గడువు పెట్టారని, అయితే అప్పటికి ఆయన ఆ పదవిలో ఉంటారో? లేదో? అని రాహుల్ సెటైర్ వేశారు. తన అంచనా ప్రకారం ఏడాదిలోపే ప్రభుత్వం కూలిపోతుందని కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో గుజరాత్‌లోని అదానీ ఓడరేవులో పట్టుబడిన మాదకద్రవ్యాల సంగతేంటి? అని ప్రశ్నించారు. పంజాబ్‌లోని

అగ్నివీరులకు మరో రెండేళ్లు సర్వీసు పొడిగింపు..

కేంద్రం కీలక నిర్ణయం



- నాలుగేళ్ల తర్వాత బయటకు వెళ్లాల్సిన 75 శాతం మందికి వెసులుబాటు
- పొడిగింపు తర్వాతా శాశ్వత సర్వీసుకు అవకాశం
- ప్రతిభ ఆధారంగా శాశ్వత నియామకాలు
- రాత పరీక్ష తర్వాతే శారీరక పరీక్ష.. నైపుణ్య ధ్రువపత్రాలు
- తొలి బ్యాచ్ సర్వీసు గడువు డిసెంబరులో ముగింపు

డెమొక్రాట్లతో కలిసి పనిచేస్తా"..

ఎన్నికల ఫలితాలతో స్వరం మార్చిన ట్రంప్

- అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లకు ఘోర పరాజయం
- హౌస్, సెనెట్ రెండింటినీ కైవసం చేసుకున్న డెమోక్రాట్లు
- ఫలితాల తర్వాత దిగొచ్చిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



ఢిల్లి : అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఓటర్లు రిపబ్లికన్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పారు. ఎన్నికల ఫలితాలకు ముందు వరకు డెమోక్రాట్లు ప్రవేశపెట్టే ప్రతీ బిల్లును వీటో చేస్తానని గర్జించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఘోర పరాజయం తర్వాత అనూహ్యంగా స్వరం మార్చారు. దేశ శ్రేయస్సు కోసం డెమోక్రాట్లతో కలిసి పనిచేయడానికి సిద్ధమని ప్రకటించారు. "ఈ ఎన్నికల్లో నేను బ్యాలెట్‌పై లేను, ఒకవేళ ఉండుంటే మేము భారీ మెజారిటీతో గెలిచేవాళ్లం" అని వ్యాఖ్యానించారు ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు అంచనాలకు మించి ప్రతినిధుల సభ (హౌస్), సెనెట్ రెండింటినీ కైవసం చేసుకోవడంతో ట్రంప్ ఈ మేరకు దిగిరాక తప్పలేదు. ఎన్బీసీ న్యూస్ అంచనాల ప్రకారం, 435 స్థానాలున్న ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు 256 సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది. అదేవిధంగా, 100 మంది సభ్యులున్న సెనెట్‌లో కనీసం 54 స్థానాలు దక్కించుకుని స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించారు. మిగతా..2లో

తుపానుకు దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు



- తుపాను వల్ల దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరణను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

అమరావతి: మురసు తుపాను దెబ్బకు దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 163 కిలోమీటర్ల మేర ప్రధాన జిల్లా, రాష్ట్ర రహదారులు దెబ్బతిన్నాయని తెలిపారు.

కరవు కష్టాల నుంచి రైతన్నను గట్టెక్కించండి

కేంద్ర బృందానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

- కరవు పరిస్థితులపై కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు సమావేశం
- రాష్ట్రానికి ప్రత్యేక సాయం అందించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి
- వీబీ జీ రామ్ జీ పథకం పనిదినాలు 200కి పెంచాలని కోరిన సీఎం
- కరవు బాధితులకు డ్రాట్ కార్డులు, జేజేఎం విస్తరణకు సహకరించాలని వినతి
- పంటల బీమా పరిహారం త్వరగా చెల్లించేలా చూడాలని సూచన



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ రంగం కుదేలైన నేపథ్యంలో, రైతులను, ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రాష్ట్రంలో కరవు తీవ్రతను అంచనా వేసేందుకు పర్యటించిన కేంద్ర అంతర మంత్రిత్వ శాఖల బృందం (ఐఎంసీటీ) బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం చేపడుతున్న ఉపశమన చర్యలను సీఎం వారికి సమగ్రంగా వివరించారు. రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను కేంద్ర బృందానికి వివరిస్తూ, "ఒకవైపు తీరప్రాంతం తుఫాన్లతో నష్టపోతుంటే, మరోవైపు రాయలసీమ, మిగతా..2లో

మురసు తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో

ముమ్మరంగా సహాయక చర్యలు



- తుఫాన్ బాధితలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత భరోసా కల్పించారు.
- వారంలో వచ్చిన రెండు తుఫాన్‌లను ప్రభుత్వం యంత్రాంగం సమర్థవంతంగా ఎదుర్కొందని పేర్కొన్నారు.

అమరావతి, నవంబరు 4 : తుఫాన్ బాధితలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత భరోసా కల్పించారు. వారం వ్యవధిలో వచ్చిన మిగతా..2లో

మొదటి పేజీ తరువాయి

మురసు తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు

రెండు తుఫాన్‌లను తమ ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా ఎదుర్కొందని పేర్కొన్నారు. ఏపీ సచివాలయంలో ఈరోజు (బుధవారం) తుఫాన్ సహాయక చర్యలపై హోంమంత్రి అనిత సమీక్షా సమావేశం నిర్వహించారు. తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్‌లో పలు కీలక అంశాలపై హోం మంత్రి దిశానిర్దేశం చేశారు.

ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి..

తుఫాన్‌ల ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు త్వరితగతిన సహాయం అందిస్తున్నామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు చొరవతో వెంటనే కేంద్ర బృందాలను పంపినందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ధన్యవాదాలు తెలిపారు. మురసు తుఫాన్ ముప్పు ఎదుర్కొన్న 7 జిల్లాల్లోని 465 గ్రామాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేశామని వెల్లడించారు. భారీ వర్షాలు, వరదల వేళ ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు.

పొంగుతున్న వాగులను దాటవద్దు..

కంట్రోల్ రూమ్‌ల ద్వారా 24 గంటలూ పరిస్థితులను పర్యవేక్షించాలని హోంమంత్రి సూచించారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తక్షణమే స్పందించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాలతో పొంగుతున్న వాగులు, రహదారులు, రోడ్లు దాటే ప్రయత్నం చేయరాదని హోంమంత్రి అనిత మార్గనిర్దేశం చేశారు.

డీఎస్సీ అభ్యర్థులకు గుడ్‌న్యూస్.. 2,721 పోస్టులతో నోటిఫికేషన్ జారీకి ఛాన్స్

స్వీకరణ, పరీక్షల తేదీలు, సిలబస్ గురించి అధికారులు వివరణ ఇవ్వనున్నారు. ఈ పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్లు 931, స్కూల్ అసిస్టెంట్లు (స్పెషల్ ఎడ్యుకేషన్) 255, సెకండరీ గ్రేడ్ టీచర్స్ 1231, ఎస్‌జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్) 304 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఏడాది మెగా డీఎస్సీ ద్వారా 16 వేల 342 పోస్టులను ఏపీ విద్యాశాఖ భర్తీ చేసిన విషయం తెలిసిందే.

తెలంగాణను గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో డీప్‌టెక్, సాంకేతిక ఆవిష్కరణలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈరోజు (బుధవారం) బేగంపేట ఐటీసీ కాకతీయ హోటల్లో ఏ100 వేడుకలు, తెలంగాణ డీప్‌టెక్ లీడర్‌షిప్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భట్టి విక్రమార్క హాజరై, మాట్లాడారు. పరిశోధనలు ప్రయోగశాలలకే పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తులుగా మారాలని మార్గనిర్దేశం చేశారు.

డీప్‌టెక్ అభివృద్ధికి హైదరాబాద్‌లో అపారమైన అవకాశాలు..

డీప్‌టెక్ అభివృద్ధికి హైదరాబాద్‌లో అపారమైన అవకాశాలు ఉన్నాయని భట్టి విక్రమార్క వెల్లడించారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, బయోటెక్, ఏరోస్పేస్ రంగాల సమన్వయంతో ముందడుగు వేస్తున్నామని తెలిపారు. పరిశ్రమలు, పరిశోధకులు, ప్రభుత్వ శాఖల సమన్వయంతో పనిచేయాలని సూచించారు.యువ స్టార్టప్‌లకు ఉమ్మడి పరీక్షా కేంద్రాలు, సులభతర ధ్రువీకరణ విధానాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. కొత్త ఆవిష్కరణలకు ప్రభుత్వం, పరిశ్రమలు అండగా నిలవాలని అన్నారు. విజయవంతమైన ప్రయోగాలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. పునరుత్పాదక విద్యుత్ వినియోగం, విద్యుత్ నిల్వ, స్మార్ట్ గ్రిడ్ వ్యవస్థల్లో సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించాలని చెప్పుకొచ్చారు.

డీప్‌టెక్ రంగం ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు..

వైద్య రంగంలో వ్యాధులను ముందుగానే గుర్తించే ఆధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులోకి రావాలని భట్టి విక్రమార్క అభిలాషించారు. రైతులకు తక్కువ ఖర్చుతో ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. సాంకేతిక ఉత్పత్తుల రూపకల్పన దశ నుంచే సామాన్యులకు అందుబాటులోని ధరలను దృష్టిలో పెట్టుకోవాలని పేర్కొన్నారు. డీప్‌టెక్ రంగం ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఉత్పాదకత పెంపునకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడాలని సూచించారు. ఆవిష్కరణల ఫలితాలు ప్రజల ఆదాయాల పెరుగుదల, మెరుగైన ప్రభుత్వ సేవలు, ఉపాధి అవకాశాల రూపంలో కనిపించాలని పేర్కొన్నారు. భారతీయ ఆలోచనలు, ఆవిష్కరణలు ప్రపంచస్థాయి పారిశ్రామిక సంస్థలుగా ఎదగాలని భట్టి విక్రమార్క ఆకాంక్షించారు.

పోలవరం-బనకచర్ల లింక్‌పై రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి

ఈ విషయం ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాలతో మరోసారి బహిర్గతమైందని ఆమె విమర్శించారు. ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాల్లో రాష్ట్ర అధికారులు గోదావరి - కావేరి నదుల అనుసంధానాన్ని సమ్మక్క సాగర్ నుంచి చేపట్టాలని కోరుతుంటే... మరోవైపు కేంద్ర హోంమంత్రి అధ్యక్షతన జరిగిన దక్షిణాది రాష్ట్రాల కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సమ్మతి తెలపడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని కవిత ఆరోపించారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని, 2024లోనే తెలంగాణ జాగృతి తరపున తాము దీనిని వ్యతిరేకించామని గుర్తుచేశారు. "రాష్ట్రానికి హక్కుగా దక్కాల్సిన 250 టీఎంసీల గోదావరి జలాలను సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు 'గురుదక్షిణ'గా చెల్లించుకుంటున్నారు" అని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆమోదంతోనే ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్లేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని కవిత హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుపై కేంద్రం జరిపే అన్ని సంప్రదింపుల నుంచి తెలంగాణ తక్షణమే వైదొలగాలని, ప్రాజెక్టును అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వెంటనే లేఖ రాయాలని ఆమె డిమాండ్ చేశారు.

మహిళా కండక్టర్ ప్రవళిక మృతి.. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవన్న మంత్రి పొన్నం


అక్టోబర్ 25న మణుగూరు నుంచి భద్రాచలం వెళ్తున్న బస్సులో టికెట్ విషయంలో ప్రయాణికురాలు బానోతు మౌనికతో ప్రవళికకు వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో అశ్వాపురం మండలం మిట్టగూడెం వద్ద ప్రయాణికురాలు... ప్రవళికను కదులుతున్న బస్సులోంచి బయటకు తోసేసింది. దీంతో బస్సు వెనుక చక్రాల కింద పడి ఆమె కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం ఆమెను హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ ఆమె కన్నుమూశారు. ప్రవళిక మృతికి నిరసనగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బుధవారం బస్సుల బంద్‌కు, రాష్ట్రవ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని ఆర్టీసీ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి.

మియాపూర్ భూములు అమ్మొద్దు, పేదలకు పంచివ్వండి: కేటీఆర్

మియాపూర్ 550 ఎకరాల భూమిని అమ్మవద్దన్న కేటీఆర్

పేదలు, అమరవీరులు, ఉద్యమకారులకు కేటాయించాలని డిమాండ్

ఏడాదిలో కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తారని ధీమా



హైదరాబాద్: మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూమి వస్తే అమ్మేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆ భూములను అమ్మి సొమ్ము చేసుకోవాలని చూడకుండా, పేదలు, అమరవీరులు, ఉద్యమకారులకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి తన అనుచరులతో కలిసి ఈరోజు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... "మియాపూర్‌లోని 550 ఎకరాల్లో 200 ఎకరాలు పేదల ఇళ్లకు, 100 ఎకరాలు అమరవీరులకు, మరో 100 ఎకరాలు ఉద్యమకారులకు కేటాయించండి. మిగిలిన భూమిలో పాఠశాలలు, కాలేజీలు కడితే మనస్ఫూర్తిగా స్వాగతిస్తాం" అని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఏడాదిలోపే కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక ఈ భూముల వ్యవహారాలపై దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చే చిత్తశుద్ధి ఉందా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఎక్కడో 80 కిలోమీటర్ల దూరంలోని ఎర్రవెల్లిలో కాకుండా, హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న మియాపూర్‌లోనే అమరవీరులకు ఇళ్లు కట్టివ్వాలని సవాల్ విసిరారు. 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ' పేరుతో జరుగుతున్న స్కాంలో భాగస్వాములైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పారిశ్రామికవేత్తలను ఆయన హెచ్చరించారు.

డెమొక్రాట్లతో కలిసి పనిచేస్తా".. ఎన్నికల ఫలితాలతో స్వరం మార్చిన ట్రంప్

మొదటి పేజీ తరువాయి



ధరలు తగ్గిస్తానని, ప్రజల జీవితాలను సులభతరం చేస్తానని 2024 ఎన్నికల్లో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన ట్రంప్, ఆ తర్వాత ఆ హామీలను పక్కనపెట్టారు. అమెరికాను గొప్పగా మార్చేందుకు టారిఫ్‌లు విధించడం, ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు కోసం యుద్ధానికి దిగడం, వైట్‌హౌస్ సుందరీకరణ వంటి భారీ ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ఇవే ఆయన పట్ల ప్రజాగ్రహానికి కారణమయ్యాయి. రిపబ్లికన్లకు కంచుకోటలైన టెక్సాస్, కాన్సాస్, దక్షిణ కరోలినా వంటి రాష్ట్రాల్లో పార్టీ ఓటమి పాలుకావడం ఆయన అంచనాలను తీవ్రంగా దెబ్బతీసింది. కాన్సాస్‌లో 95 ఏళ్ల రిపబ్లికన్ల గుత్తాధిపత్యానికి తెరదించుతూ డెమోక్రాట్ అభ్యర్థి ఆడమ్ హామిల్టన్ సెనెటర్‌గా గెలిచారు. టెక్సాస్ గవర్నర్‌గా హినా హినోజోసా ఎన్నికవడంతో 36 ఏళ్ల రిపబ్లికన్ పాలనకు ముగింపు పడింది. ట్రంప్ స్వయంగా ఎంపిక చేసిన అభ్యర్థులు సైతం ఓడిపోవడం ఆయనకు వ్యక్తిగతంగా పెద్ద ఎదురుదెబ్బ. ఈ ఓటమితో పార్టీపై ట్రంప్ పట్టు సడలుతుందని, ఆయనను వ్యతిరేకించే వారి సంఖ్య పెరుగుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అధ్యక్షుడిగా మిగిలిన రెండేళ్లలో ఆయన దూకుడుకు కళ్లెం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఫలితాల తర్వాత 'పొలిటికో'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "రెండేళ్ల పాటు ప్రతీదాన్నీ వీటో చేస్తూ కూర్చోవాలని నేను అనుకోవడం లేదు. దేశానికి మంచి జరిగేలా చూసేందుకు డెమోక్రాట్లతో కలిసి పనిచేస్తాం" అని తెలిపారు. అయితే, డెమోక్రాట్లు మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. ప్రతినిధుల సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టనున్న హకీమ్ జెఫ్రీస్ మాట్లాడుతూ, "మేము కీలకమైన మార్పులు తీసుకురావాల్సి ఉంది. ఇప్పుడున్న వ్యవస్థలు సరిగా లేవు. అమెరికా ప్రజలకే ప్రాధాన్యత ఇచ్చే కాంగ్రెస్ కావాలి" అని స్పష్టం చేశారు. దీంతో రాబోయే రెండేళ్లలో ట్రంప్ పాలన ఎలా సాగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

తుపానుకు దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు

మొదటి పేజీ తరువాయి

రెండు చోట్ల స్కౌర్స్, నాలుగు చోట్ల రోడ్డు కోతలు, 5 కల్వర్టు పనులకు నష్టం వాటిల్లినట్లు గుర్తించామని అన్నారు. 201 చెట్లు నేలకూలగా వాటిని పూర్తిగా తొలగించినట్లు వెల్లడించారు. 73 ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయాలు ఏర్పడగా ఇప్పటికే 34 చోట్ల రాకపోకలను పునరుద్ధరించామని చెప్పారు. నెల్లూరు జిల్లాలో 66.600 కిలోమీటర్లు, పశ్చిమగోదావరిలో 38.572 కిలోమీటర్లు, ప్రకాశంలో 3.600 కిలోమీటర్లు, పల్నాడులో 1.386 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని మంత్రి వివరించారు. తాత్కాలిక మరమ్మతులకు రూ.16.66 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.126.70 కోట్లు మొత్తం రూ.143.36 కోట్ల నిధులు అవసరమని అంచనా వేసినట్లు తెలిపారు. తుపాను ప్రభావం పూర్తిగా తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపడుతూ ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన యంత్రాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచి ప్రజలకు రవాణా ఇబ్బందులు లేకుండా పునరుద్ధరణ పనుల్లో జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉంటాలి : మురసు తుపాను, భారీ వర్షాల వేళ వరద ముప్పు నివారణకు అప్రమత్తంగా ఉండాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఉన్నతాధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి వరద నీటి ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, పంట పొలాల్లో నిలిచిన నీటిని కెనాల్స్, డ్రైన్ల ద్వారా బయటకు పంపేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మురసు తుపాను ప్రభావంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయని డ్రైన్లు గరిష్ఠ నీటిమట్టాన్ని మించి ప్రవహిస్తుండటంతో ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. బుడమేరు, ఎర్రకాలువ, గోనెలవాగు, తమ్మిలేరు, ఏలేరు, రిజర్వాయర్లకు ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలన్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు వాగుల నుంచి ప్రకాశం బ్యారేజీకి 71 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని తెలిపారు. బుడమేరు క్యాచ్‌మెంట్ ప్రాంతంలో కురిసిన వర్షపు నీటిని బుడమేరు డైవర్షన్ కెనాల్ ద్వారా కృష్ణా నదిలోకి



తరలిస్తున్నామని వివరించారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లోను దృష్టిలో ఉంచుకుని వరద నిర్వహణ చేపట్టాలని సూచించారు. విజయవాడలో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో ఎనికేపాడు నుంచి 3 వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి తరలిస్తున్నట్లు తెలిపారు. ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టి అప్రమత్తంగా ఉండాలని, తూర్పుగోదావరి జిల్లాలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితులను సమీక్షించాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు.

కరవు కష్టాల నుంచి రైతన్నను గట్టెక్కించండి: కేంద్ర బృందానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

మొదటి పేజీ తరువాయి

ఇతర ప్రాంతాలు ఎల్ నినో ప్రభావంతో తీవ్ర కరవు కోరల్లో చిక్కుకున్నాయి" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది సాధారణం కంటే అత్యంత తక్కువ వర్షపాతం నమోదు కావడం వల్ల ఖరీఫ్ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని, సాగునీటితో పాటు తాగునీరు, పశుగ్రాసానికి కూడా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. దేశంలోనే రెండో అత్యల్ప వర్షపాతం నమోదైన ప్రాంతంగా అనంతపురం జిల్లా నిలిచిన విషయాన్ని ఆయన బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 412 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించామని, పంట నష్టాలపై పూర్తిస్థాయి అంచనాలతో వారం రోజుల్లో కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

వ్యవసాయానికి అండగా కీలక పథకాల విస్తరణ

కరవు పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ఉపాధిని, వ్యవసాయాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి కొన్ని కీలక ప్రతిపాదనలు చేశారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి క్షేత్రస్థాయిలో మానవ వనరుల అవసరం ఎక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో 'వీబీ జీ రామ్ జీ' పథకం కింద పనిదినాలను 200 రోజులకు పెంచాలని కోరారు. ఈ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానించడం



ద్వారా రైతులకు కూలీల కొరత తీరడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని సూచించారు. కరవు కారణంగా రైతుల ఆదాయం పూర్తిగా పడిపోయిందని, గతంలో తీవ్ర కరవు వచ్చినప్పుడు రాయలసీమలో పది ఎకరాల రైతులకు కూడా రేషన్ కార్డులు ఇచ్చి ఆదుకున్నామని గుర్తుచేశారు. అదే తరహాలో ప్రస్తుతం అర్హులైన కరవు బాధిత కుటుంబాలకు 'డ్రాట్ కార్డులు' జారీ చేసే అంశాన్ని పరిశీలించి, కేంద్ర సహకారంతో నిత్యావసరాలను సబ్సిడీపై అందించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు, రైతుల వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేసేందుకు కేంద్రం తోడ్పాటునందించాలని కోరారు.

జల్ జీవన్ మిషన్‌తో శాశ్వత పరిష్కారం

వర్షాభావంతో భూగర్భ జలమట్టాలు ప్రమాదకరంగా పడిపోయాయని, కొత్తగా ఎన్ని బోర్లు వేసినా నీళ్లు పడటం లేదని ముఖ్యమంత్రి తెలిపారు. కేవలం తాత్కాలిక నీటి సరఫరా చర్యలతో సరిపెట్టకుండా, శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఇందుకోసం 'జల్ జీవన్ మిషన్' (జేజేఎం) పథకాన్ని మరింత విస్తరించి, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి, అనుసంధానం వంటి పనులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు. పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమా పరిహారాన్ని త్వరగా అందించడం అత్యవసరమని అన్నారు. బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం లేకుండా, వీలైనంత త్వరగా పరిహారం రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా కేంద్రం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇది రైతులకు తదుపరి పంటకు పెట్టుబడిగా ఉపయోగపడుతుందని వివరించారు. ఈనెల 2, 3 తేదీల్లో కేంద్ర బృందం రెండు టీమ్‌లుగా విడిపోయి కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయిలో పంట నష్టాలను పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ నివేదిక, తమ క్షేత్రస్థాయి పరిశీలనల ఆధారంగా 15 రోజుల్లో కేంద్రానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామని ఐఎంసీటీ సభ్యులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అందించే సహాయంపై నిర్ణయం తీసుకోనుంది.

ప్రధాని మోదీ 'దేశద్రోహి' అని ఐదు నిమిషాల్లోనే నిరూపిస్తా

మొదటి పేజీ తరువాయి

సంగ్రూర్‌లో జరిగిన 'ఇన్సాఫ్ ర్యాలీ'లో రాహుల్ గాంధీ ఈ మేరకు ప్రభుత్వం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "నేను అమిత్ షాను ఒక్కటే అడగాలనుకుంటున్నా. అదానీ ఓడరేవులో పట్టుబడిన మాదకద్రవ్యాల సంగతేంటి? ఆ విషయంలో మీరు తీసుకున్న చర్యలేమిటి? అక్కడ పట్టుబడిన వేల కిలోల మాదకద్రవ్యాలు, హెరాయిన్ ఏమయ్యాయి? మీరు శాంతిభద్రతల గురించి మాట్లాడుతున్నారు. నిజానికి, మీరు జైళ్లలో ఉన్న గ్యాంగ్‌స్టర్లకు ఆశ్రయం కల్పిస్తున్నారు. అమిత్ షా తన గ్యాంగ్‌స్టర్లను ప్రోత్సహిస్తున్నారని దేశం మొత్తానికి తెలుసు. మాదకద్రవ్యాల గురించి, శాంతిభద్రతల గురించి మాట్లాడకండి. ఒకవేళ మీరు శాంతిభద్రతల గురించి మాట్లాడాలనుకుంటే, మణిపూర్‌లో ఏం జరుగుతుందో దేశానికి చెప్పండి."

'కేవలం ఐదునిమిషాల్లోనే దేశద్రోహి అని నిరూపిస్తా'

తనతో చర్చకు రావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విసిరిన సవాల్ గురించి రాహుల్ ప్రస్తావించారు. "నాతో ముఖాముఖి చర్చకు రావాలని నరేంద్ర మోదీకి సవాలు విసిరాను. ఆ చర్చకు మధ్యవర్తిగా ఎవరినైనా (న్యాయనిర్ణేతగా) ఎంచుకోవచ్చునని చెప్పాను. ఒకవేళ మోదీ నాతో చర్చకు కూర్చుంటే, ఐదు నిమిషాల్లోనే, ఆయన ఒక 'దేశద్రోహి' అని, ఆయన్ను డోనాల్డ్ ట్రంప్ నియంత్రిస్తున్నారని నేను నిరూపించగలను" రాహుల్ గాంధీ ఆరోపించారు.

పంజాబ్ ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

మరోవైపు, పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీపై కూడా రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, డ్రగ్స్ సమస్యను పూర్తిగా నిర్మూలిస్తామని భగవంత్ మాన్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. వారు ఎక్కడ నిర్మూలించారు? పంజాబ్‌లో ఏ ఒక్క ప్రాంతం నుంచైనా వారు డ్రగ్స్‌ను తొలగించగలిగారా? ఈ సమస్యను అంతం చేసే సామర్థ్యం వారికి అస్సలు లేదు. అంతేకాదు, చాలా ఏళ్ల క్రితం, నేను మొదటిసారి పంజాబ్‌ను సందర్శించినప్పుడు, మాదకద్రవ్యాల సమస్య విస్తరిస్తోందని చెప్పాను. అప్పుడు ప్రతిపక్షాలైన బీజేపీ, అకాలీ దళ్, ఇతర పార్టీలు, 'రాహుల్ గాంధీకి పంజాబ్ గురించి ఏమీ తెలియదు, రాష్ట్రంలో డ్రగ్స్ సమస్య ఏమీ లేదు' అని వాదించాయి" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. పంజాబ్‌లో పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ప్రముఖ పంజాబీ గాయకుడు



సిద్ధూ మూసేవాలాను పగటి పూట అందరూ చూస్తుండగానే హత్యం చేయడం తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. పంజాబ్, దేశం కోసం పనిచేయాలని ఆశించే ఎవరినైనా బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం, చివరకు పగటిపూట అందరి కళ్లముందే కాల్చి చంపడం జరుగుతోందని ఆరోపించారు. పంజాబ్ ప్రజలకు తమకోసం పనిచేసే ప్రభుత్వం కావాలని, ఢిల్లీ నుంచి నడిపించే ఆప్ లాంటి సర్కార్ కాదంటూ కేజ్రీవాల్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. యువతకు ఉద్యోగాలు, డ్రగ్స్ రహిత పంజాబ్ కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని రాహుల్ పిలుపునిచ్చారు.

అగ్నివీరులకు మరో రెండేళ్ల సర్వీసు పొడిగింపు.. కేంద్రం కీలక నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ : అగ్నిపథ్ పథకం కింద సైన్యంలో చేరిన అగ్నివీరులకు కేంద్ర ప్రభుత్వం కీలక వెసులుబాటు కల్పించింది. ఇప్పటికే ఉన్న నాలుగేళ్ల సర్వీసుకు అదనంగా మరో రెండేళ్లు పొడిగించాలని నిర్ణయించింది. తొలి బ్యాచ్ అగ్నివీరుల పదవీకాలం ముగియనున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నిర్ణయం ప్రకారం, నాలుగేళ్ల సేవ తర్వాత సాధారణ విధానంలో శాశ్వత సైనికులుగా ఎంపిక కాని మిగిలిన 75 శాతం అగ్నివీరులకు మరో రెండేళ్లు పనిచేసే అవకాశం లభించనుంది. ఈ పొడిగించిన సేవ పూర్తయ్యాక కూడా ప్రతిభ ఆధారంగా సాధారణ సైనిక విభాగంలో చేరేందుకు అవకాశం కల్పిస్తామని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి వెల్లడించారు. అగ్నిపథ్ పథకం 2022లో ప్రారంభమైంది. ప్రస్తుతం ఈ పథకం కింద సైన్యం, నౌకాదళం, వాయుసేనల్లో నాలుగేళ్ల కాలానికి నియామకాలు చేపడుతున్నారు. ఈ గడువు ముగిసిన తర్వాత ప్రతి బ్యాచ్‌లో గరిష్ఠంగా 25 శాతం మందిని ప్రతిభ, సైనిక దళాల అవసరాల ఆధారంగా సాధారణ సర్వీసులో కొనసాగించే అవకాశం ఉంది. మిగిలినవారు విధుల నుంచి వైదొలగాల్సి వచ్చేది. తాజా నిర్ణయంతో వారికి అదనపు సేవా అవకాశం లభించనుంది. నియామక ప్రక్రియలోనూ మార్పులు ప్రకటించారు. ఇకపై శారీరక పరీక్షకు ముందుగా రాత పరీక్ష నిర్వహించనున్నారు. సైన్యంలో పనిచేసిన సమయంలో అగ్నివీరులు పొందిన శిక్షణ, నైపుణ్యాలను గుర్తిస్తూ ధ్రువపత్రాలు కూడా అందించనున్నారు. తొలి బ్యాచ్‌లో సుమారు 18 వేల మంది అగ్నివీరుల నాలుగేళ్ల సర్వీసు గడువు 2026 డిసెంబరులో ముగియనుండటంతో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.



తెలంగాణ ప్రగతిలో యాదవుల భాగస్వామ్యం అవసరం

తమ ప్రయత్నమని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. మూసీ అభివృద్ధి, మెట్రో విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని.. ఇందుకు యాదవ సోదరుల సహకారం ఉండాలని కోరారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటి గోల్కొండ కోట ఒకనాటి గొల్లంకొండ అని ప్రస్తావించారు. యాదవ సోదరుల సహకారంతోనే హైదరాబాద్ నగరం ఇంతగా అభివృద్ధి చెందిందని అన్నారు. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారిని యాదవ సోదరులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని చెప్పుకొచ్చారు. గతంలో ఏ ముఖ్యమంత్రి సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలనే ఆలోచన చేయలేదని పేర్కొన్నారు.

తెలంగాణలో కులగణన చేశాం..


సదర్ సమ్మేళనం నిర్వహణకు తమ ప్రభుత్వంలో రూ.5 కోట్లు మంజూరు చేశామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణలో తాము కులగణన చేసి చూపించామని ఉద్ఘాటించారు. రాష్ట్ర మోడల్‌ను దేశం అనుసరించేలా కులగణన నిర్వహించామని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వంలో యాదవులకు సముచిత స్థానం కల్పించామని వెల్లడించారు. అనిల్ కుమార్ యాదవ్‌ను రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని తెలిపారు. ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట బోర్డు సభ్యురాలిగా నియమించామని ప్రస్తావించారు. యాదగిరి గుట్ట గోశాలలో గోసంరక్షణ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే యాదవులకు దక్కాల్సిన వాటా వారికి దక్కేలా చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

సంపాదకీయం

ఇతర దేశాల్లో 'సర్' ఇలా..!

పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అనుసరిస్తున్న మిగతా దేశాల్లో ఓటర్ల జాబితాలు ఎలా తయారవుతాయి? భారత్ తరహా 'సర్' పద్ధతిని ఆయా దేశాల్లో అమలు చేస్తారా? దేశంలో ఓటర్ల జాబితా నవీకరణ వివాదాస్పదమైన నేపథ్యంలో ఇవి పరిశీలించాల్సిన అంశాలయ్యాయి. సాధారణంగా ఓటర్ల జాబితాల సవరణలో పేర్ల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులు, వివరాలు సరిదిద్దడం వంటివి జరుగుతూనే ఉంటాయి. అయితే భారత్‌లో ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో ఓటర్ల అర్హతలను విస్తృతంగా పరిశీలించి జాబితాలను సమగ్రంగా సవరించడంపై దృష్టి పెట్టారు. అమెరికా విధానం ఈ విషయంలో ప్రత్యేకంగా గమనించదగినది. అక్కడ దేశవ్యాప్తంగా ఒకే కేంద్ర సంస్థ రూపొందించే ఏకీకృత ఓటర్ల జాబితా లేదు. ఓటర్ల నమోదు, జాబితాల నిర్వహణ ప్రధానంగా రాష్ట్రాలు, స్థానిక ఎన్నికల అధికారుల పరిధిలో ఉంటాయి. నార్త్ డకోటా మినహా మిగతా రాష్ట్రాల్లో ఓటు వేయడానికి సాధారణంగా ముందస్తు నమోదు అవసరం. రాష్ట్రాన్ని బట్టి ఆన్‌లైన్, తపాలా లేదా ప్రభుత్వ కార్యాలయాల ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. మరణాలు, చిరునామాల మార్పులు, అర్హతకు సంబంధించిన వివరాలను ప్రభుత్వ రికార్డులతో సరిపోల్చి జాబితాలను నవీకరిస్తారు. ఒక వ్యక్తి ఓటు వేయలేదనే కారణంతోనే అతని పేరును తొలగించడానికి సమాఖ్య చట్టం అనుమతించదు. జాబితాల శుద్ధి ప్రక్రియలకూ చట్టపరమైన పరిమితులు ఉంటాయి. అమెరికాలోనూ ఓటర్ల వివరాల పరిశీలన జరుగుతుంది. కానీ అది భారత్‌లోని ఎస్ఐఆర్ తరహాలో కేంద్రీకృత ప్రక్రియ కాదు. రాష్ట్రాలవారీగా నిరంతర నవీకరణ ఉంటుంది. జర్మనీలో నివాస నమోదు వ్యవస్థ ఎన్నికల ప్రక్రియకు కీలకం. పౌరులు నివాస చిరునామాను సంబంధిత స్థానిక సంస్థల్లో నమోదు చేసుకున్నప్పుడు, ఆ సమాచారం ఆధారంగా అర్హులైన ఓటర్ల జాబితాలను రూపొందిస్తారు. అందువల్ల ప్రతి ఎన్నికకు ముందు ప్రతి ఒక్కరూ మళ్లీ మొదటి నుంచి నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉండదు. నివాస మార్పులు, ఇతర పరిపాలనా వివరాలు నవీకరించడం ద్వారా జాబితాల కచ్చితత్వాన్ని కాపాడే ప్రయత్నం జరుగుతుంది. అయితే అర్హతలు, ఎన్నికల రకాన్ని బట్టి నిబంధనలు మారవచ్చు.ఆస్ట్రేలియాలో ఎన్నికల సంఘం ప్రభుత్వ విభాగాల నుంచి లభించే సమాచారాన్ని ఉపయోగించి ఓటర్ల వివరాలను నవీకరిస్తుంది. అర్హులైన పౌరులు జాబితాలో నమోదు అయ్యేలా చూడటానికి ప్రత్యక్ష నమోదు, సమాచార సరిపోలిక వంటి విధానాలకు ప్రాధాన్యం ఇస్తారు. కెనడాలోనూ జాతీయ ఓటర్ల రిజిస్టర్ నిర్వహిస్తారు. పన్నుల శాఖ సహా వివిధ ప్రభుత్వ సంస్థల నుంచి లభించే సమాచారంతో వివరాలను సరిచూస్తారు. చిరునామా మారినవారి వివరాలను నవీకరించడం ద్వారా ఎన్నికల సమయంలో ఓటర్లకు ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించేందుకు ప్రయత్నిస్తారు. ఈ దేశాల్లో జాబితాల కచ్చితత్వంతో పాటు, అర్హులైనవారు నమోదు ప్రక్రియలో వెనుకబడిపోకుండా చూడటానికీ ప్రాధాన్యం ఉంటుంది. బ్రిటన్‌లో వ్యక్తిగత ఓటరు నమోదు విధానం అమల్లో ఉంది. స్థానిక ఎన్నికల నమోదు అధికారులు జాబితాలను నిర్వహిస్తూ, వార్షిక తనిఖీలు, ప్రభుత్వ రికార్డుల ఆధారంగా వివరాల సవరణ చేపడతారు. ఫ్రాన్స్, స్వీడన్ వంటి దేశాల్లోనూ జనాభా, నివాస నమోదు వ్యవస్థలు ఎన్నికల నిర్వహణకు ఉపయోగపడతాయి. పౌరసత్వం, నివాస అర్హత, ఎన్నికల స్వభావం, స్థానిక చట్టాల ఆధారంగా నమోదు ప్రక్రియలు మారుతుంటాయి. ఈ పద్ధతులు భారత్‌కు ముఖ్యమైన పాఠాలను అందిస్తున్నాయి. ఓటర్ల జాబితాల సమగ్ర సవరణను ఒక ప్రత్యేక కార్యక్రమంగా చేపట్టాల్సిన పరిస్థితులు రావచ్చు. కానీ దానికి ముందు నిరంతర నవీకరణ వ్యవస్థను బలోపేతం చేయడం మరింత ప్రయోజనకరం. జనన, మరణాల నమోదు, చిరునామా మార్పులు, ప్రభుత్వ రికార్డుల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచాలి. ఆధార్ వంటి గుర్తింపు పత్రాలను ఉపయోగించినా, వాటి ఆధారంగా మాత్రమే ఓటు హక్కును నిర్ణయించకుండా ఎన్నికల చట్టాలు నిర్దేశించిన అర్హతలనే ప్రాతిపదికగా తీసుకోవాలి. పేరు తొలగించే ముందు సంబంధిత వ్యక్తికి సమాచారం అందించడం, అభ్యంతరాలు తెలిపేందుకు తగిన సమయం ఇవ్వడం, నిర్ణయానికి కారణాలను వెల్లడించడం అవసరం. రాజకీయ పార్టీలకు, పౌర సమాజానికి పారదర్శక పరిశీలనలో భాగస్వామ్యం కల్పించాలి. ఓటర్ల జాబితాల సవరణ అనేది పౌరుల ప్రజాస్వామిక హక్కుతో ముడిపడిన బాధ్యత. జాబితాల్లో అనర్హుల పేర్లు ఉండకూడదు, అంతకంటే ముఖ్యంగా అర్హులైన ఒక్క పౌరుడి పేరు కూడా అన్యాయంగా తొలగిపోకూడదు. అంతర్జాతీయ విధానాల్లో ఏ పద్ధతిని అనుసరించినా పారదర్శకత, ప్రజలకు అందుబాటు, అప్పీలు చేసుకునే అవకాశం, అర్హులైన ప్రతి ఓటరుకు హక్కు రక్షణ అనేవే ప్రాధాన్య సూత్రాలుగా ఉండాలి. ఓటర్ల జాబితా శుద్ధి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి తప్ప, ఓటు హక్కుపై అనుమానాలు పెంచకూడదు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌లో భారత్‌దే భవిత



క్వాంటమ్ కంప్యూటింగ్ విషయంలో భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే అత్యధిక క్వాంటమ్ స్టార్టప్‌లు ఉన్న దేశాల సరసన చేరింది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహకాలను ఉపయోగించుకుని ప్రైవేటు రంగం మరిన్ని పెట్టుబడులతో ముందుకు రావాల్సిన అవసరముందని ఐబీఎం ఇండియా, దక్షిణాసియా చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్(సీటీవో) డాక్టర్ అమిత్ సింఘీ పేర్కొన్నారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీతో ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన క్వాంటమ్ కంప్యూటింగ్ మౌలిక వసతులు ఉన్న దేశాల్లో ఒకటిగా భారత్ నిలవగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఐబీఎం రీసెర్చ్ ఇండియా, ఏఐ ఫర్ జీ, సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్ ల్యాబ్ డైరెక్టర్‌గానూ వ్యవహరిస్తున్న సింఘీతో 'ఈనాడు' ప్రతినిధి బెజవాడ వెంకటేశ్వర్లు ఇంటర్వ్యూ... అమెరికా, చైనా, ఐరోపా దేశాలతో పోలిస్తే ప్రస్తుతం క్వాంటమ్ కంప్యూటింగ్‌లో భారత్ ఏ స్థాయిలో ఉంది? ఈ రంగంలో అంతర్జాతీయ శక్తిగా ఎదగడానికి మన దేశం చేయాల్సిందేమిటి? క్వాంటమ్ టెక్నాలజీకి సంబంధించి ప్రత్యేక వ్యూహం కలిగిన అతికొద్ది దేశాల్లో భారత్ ఒకటి. నేషనల్ క్వాంటమ్ మిషన్ ద్వారా దేశీయ క్వాంటమ్ వ్యవస్థకు విధానపరమైన సహకారం లభించనుంది. తద్వారా దీర్ఘకాలిక సామర్థ్యాలు అందివస్తాయి. అమరావతి క్వాంటమ్ వ్యాలీలోని ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్-2తో అత్యంత శక్తిమంతమైన క్వాంటమ్ కంప్యూటింగ్ వసతులు ఉన్న దేశాల్లో ఒకటిగా భారత్ నిలవగలదు. అయితే ఇండియా తన విజ్ఞానాన్నీ, పరిశోధనలనూ... వ్యాపారులకూ సమాజానికీ ప్రయోజనం చేకూర్చేలా, సమస్యలను పరిష్కరించేలా ఉపయోగించాలి. పరిశోధన-అభివృద్ధికి పెద్దపీట వేసి, అంతర్జాతీయ స్థాయిలో పోటీనిచ్చేలా మేధో సంపత్తి(ఐపీ)ని సృష్టించుకోవాలి. అందుకుగాను పరిశోధకులు, స్టార్టప్‌లు కలిసి కొత్త అల్గారిథమ్‌లు, సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్‌ను అభివృద్ధి చేయాలి. క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రస్తుతం సంప్రదాయ కంప్యూటర్లకు సాధ్యంకాని క్లిష్టమైన సమస్యలను పరిశోధించే దశలో ఉంది. ఈ టెక్నాలజీ వాణిజ్యపరంగా అందుబాటులోకి రావడానికి మరికొంత సమయం పట్టొచ్చు. ముఖ్యంగా హార్డ్‌వేర్, ఎర్రర్ కరెక్షన్, అల్గారిథమ్‌లలో పురోగతి సాధించడంపై ఇది ఆధారపడి ఉంటుంది. ఐబీఎంలో క్వాంటమ్ కంప్యూటర్ల సామర్థ్యాన్ని పెంచి, లోపాలను తగ్గించే వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నాం. పరిశ్రమలు, పరిశోధనలకు ఉపయోగపడే అంశాలపై పనిచేస్తున్నాం. మన దేశంలో పరిశోధనా ఫలితాలను ఆచరణాత్మక పరిష్కారాలుగా తీర్చిదిద్దడమే ప్రధాన సవాలు. ఇందుకు ప్రత్యేక నైపుణ్యాలు ఉన్న శాస్త్రవేత్తలు, వ్యాపార నిపుణుల సంఖ్య పెరగాలి. దీర్ఘకాలిక నిధులు, మౌలిక వసతులు, మార్కెట్ ఆధారిత వాణిజ్యీకరణకు స్పష్టమైన మార్గాలను రూపొందించుకోవాల్సి ఉంది. క్వాంటమ్ సాంకేతికతల్లో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు కేంద్రం, రాష్ట్రాలు పలు చర్యలు తీసుకుంటున్నాయి. ముఖ్యంగా నేషనల్ క్వాంటమ్ మిషన్ ద్వారా స్టార్టప్‌లకు మద్దతు లభిస్తుంటే, పరిశోధన-అభివృద్ధి-వినూత్నత(ఆర్‌డీఐ) ఫండ్ ద్వారా డీప్‌టెక్ సంస్థలకు దీర్ఘకాలిక పెట్టుబడి అవకాశాలు ఏర్పడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్వాంటమ్ వ్యాలీని అభివృద్ధి చేయడంతో పాటు స్టార్టప్‌లకు ప్రోత్సాహకాలు అందజేస్తోంది. ప్రైవేటు రంగం వీటిని సద్వినియోగం చేసుకుని వెంచర్, ఆర్‌అండ్‌డీ, పరిశోధన వాణిజ్యీకరణలో మరింత చురుగ్గా పెట్టుబడులు పెట్టాలి. పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సహకారాన్ని పెంచి మార్కెట్ అవసరాలను తీర్చే ఉత్పత్తులను తీసుకురావాలి. తద్వారా కొత్త వ్యాపార అవకాశాలు అందివస్తాయి. దేశీయ క్వాంటమ్ రంగానికి అవసరమైన పరిశోధన, సామర్థ్యాల పెంపు, స్టార్టప్‌ల అభివృద్ధికి ఐబీఎం ఎలాంటి కృషి చేస్తోంది? ఐఐటీ మద్రాస్‌తో కలిసి 'ఎన్‌పీటీఈఎల్' ద్వారా 'ఇంట్రొడక్షన్ టు క్వాంటమ్ కంప్యూటింగ్' కోర్సును ఐబీఎం అందిస్తోంది. బిట్స్‌పిలానీ గోవా క్యాంపస్ పరిశోధకులు ఐబీఎం క్వాంటమ్ కంప్యూటర్‌తో 'హైఎనర్జీ ఫిజిక్స్'లో మంచి ఫలితాలు సాధించారు. ప్రపంచ 'క్వాంటమ్ అడ్వాంటేజ్ ట్రాకర్'లో ఇండియా నుంచి నమోదైన తొలి ఫలితమిదే. అమరావతిలో ఐబీఎం క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయడం వల్ల దేశానికి ఒనగూడే ప్రయోజనాలేంటి? ముందుగా ఏయే రంగాల్లో మార్పులు వస్తాయంటారు? అమరావతిలోని 'ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్-2' ద్వారా పరిశోధకులు, విద్యాసంస్థలు, స్టార్టప్‌లు అత్యాధునిక క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యవస్థను వాడి అల్గారిథమ్‌లను అభివృద్ధి చేసి పరీక్షించగలుగుతారు. తద్వారా జపాన్ వంటి దేశాల మాదిరిగా మన దగ్గర కూడా విస్తృతమైన పరిశోధన-ఆవిష్కరణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవచ్చు. ఏపీ ప్రభుత్వం, ఐఐటీ-మద్రాస్, ఐఐటీ-తిరుపతి కలిసి అమరావతిలో 'క్వాంటమ్ ఇన్నోవేషన్ సెంటర్'ను అభివృద్ధి చేస్తున్నాయి. పరిశోధకులు, విద్యార్థులు, డెవలపర్లకు సాంకేతిక సహకారం అందించి, మార్గదర్శనం చేయడం ద్వారా ప్రయోజనకరమైన ప్రాజెక్టులను ప్రోత్సహించాలన్నది దీని లక్ష్యం. అయితే మొదట జీవశాస్త్రాలు, ఆవిష్కరణలు, మెటీరియల్ సైన్స్, ఆర్థిక సేవలు, ఇంధనం, లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన అప్లికేషన్లను అందించవచ్చు. క్రమంగా పరిశోధనా సామర్థ్యాలను పెంచుకుని, ప్రయోజనకరమైన పరిష్కారాలను అభివృద్ధి చేసుకోవచ్చు. 2030 నాటికి ప్రపంచ క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో భారత్ పాత్ర ఎలా ఉండనుంది? అందుకోసం ఎలాంటి మౌలిక వసతులు, పారిశ్రామిక సహకారం అవసరమవుతాయి? ప్రస్తుతం మన దగ్గర కంపెనీలు ఇంకా క్వాంటమ్ టెక్నాలజీ ఉపయోగాలను అర్థం చేసుకునే దశలోనే ఉన్నాయి. కానీ, నాలుగైదు ఏళ్లలో క్వాంటమ్ అల్గారిథమ్స్, క్వాంటమ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, అప్లికేషన్ డిస్కవరీ వంటి అంశాల్లో భారత్ నాయకత్వ స్థాయికి చేరే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే, ఇవి విస్తృతమైన పరిశోధనలకు ఆస్కారం ఉన్న రంగాలు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి సాంకేతిక నిపుణులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమల మద్దతు, పెట్టుబడులు పెరగాలి.

బియ్యం బంగారమాయే!



దేశంలోనే ప్రధాన వరి ఉత్పత్తి రాష్ట్రాల్లో ఒకటిగా పేరొందిన తెలంగాణలో ఇప్పుడు బియ్యం ధరలు సామాన్యులకు భారంగా మారుతున్నాయి. ముఖ్యంగా సన్న బియ్యం ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో మధ్యతరగతి, పేద కుటుంబాల బడ్జెట్‌పై ప్రభావం పడుతోంది. అసలు తెలంగాణలో బియ్యం ధరలు పెరగడానికి దారితీస్తున్న పరిస్థితులేమిటి? ధరల నియంత్రణకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలేమిటి? రైతులకు గిట్టుబాటు ధర లభించడం ఎంత ముఖ్యమో, వినియోగదారులకు నాణ్యమైన బియ్యం అందుబాటు ధరలో లభించడం కూడా అంతే ముఖ్యం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బియ్యం ధరలు పెరగడానికి దారితీస్తున్న అసలు కారణాలేమిటి? సాగు విస్తీర్ణం తగ్గడం, సరఫరా వ్యవస్థలో మార్పులు ధరలపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయి?

తగ్గుతున్న సాగు విస్తీర్ణం.. పెరుగుతున్న ధరలు

తగ్గుతున్న వరి సాగు విస్తీర్ణం, వాతావరణ మార్పులు, ఇతర రాష్ట్రాల నుంచి పెరుగుతున్న ధాన్యం డిమాండ్, వ్యాపారుల నిల్వలు వంటి అంశాలు ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంపై నెలకొన్న ఆందోళనలు వరి దిగుబడిపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.. గత ఏడాదితో పోలిస్తే వరి సాగు విస్తీర్ణం తగ్గడం కూడా ధరల పెరుగుదలకు ఒక కారణంగా మారింది. తెలంగాణలో పండే నాణ్యమైన సన్న రకం ధాన్యానికి ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు తెలంగాణ రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో స్థానిక మిల్లర్లు, వ్యాపా రులకు అందుబాటులో ఉండే ధాన్యం పరిమాణం తగ్గి బహిరంగ మార్కెట్లో బియ్యం సరఫరాపై ప్రభావం పడుతోంది.

ముందస్తు నిల్వలు.. వ్యాపారుల కొనుగోళ్లు

ప్రభుత్వం సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేయడం, రైతులకు బోనస్ అందించడం వల్ల రైతులకు మేలు జరుగు తున్నప్పటికీ, బహిరంగ మార్కెట్లో మిల్లర్లు, వ్యాపారులకు అందుబాటులో ఉండే ధాన్యం పరిమాణంపై ప్రభావం పడుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్తులో బియ్యం ధరలు మరింత పెరుగుతాయనే అంచనాలతో కొందరు వ్యాపారులు ముందుగానే బియ్యం నిల్వలు చేసుకుంటున్నారనే చర్చ మార్కెట్లో ఉంది. దీనికి తోడు మిల్లింగ్, విద్యుత్, రవాణా, ప్యాకింగ్ ఖర్చులు కూడా ధరల పెరుగుదలకు తోడవుతున్నాయి.

బియ్యం ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు..

వరి సాగు ఖర్చుల పెరుగుదల ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, డీజిల్, కూలీల ఖర్చులు పెరగడం. వాతావరణ పరిస్థితులు అకాల వర్షాలు, వరదలు, కరువు కారణంగా వరి దిగుబడి తగ్గడం. ఉత్పత్తి తగ్గడం దీంతో సాధారణంగానే మార్కెట్లో బియ్యం సరఫరా తగ్గుతుంది. రవాణా ఖర్చులు డీజిల్ ధరలు, రవాణా ఛార్జీలు పెరగడం వల్ల బియ్యం ధరలు పెరుగుతాయి. నిల్వలు తగ్గడం ప్రభుత్వ, ప్రైవేటు గోదాముల్లో బియ్యం నిల్వలు తగ్గడం. ఎగుమతుల ప్రభావం బియ్యం ఎగుమతులు పెరగడం లేదా ఎగుమతి విధానాల్లో మార్పులు రావడం వల్ల దేశీయ మార్కెట్‌పై ప్రభావం పడవచ్చు. మధ్యవర్తుల ప్రభావం వ్యాపారుల నిల్వ లు, హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లో ధరల మార్పులు. వినియోగదారుల డిమాండ్ పండుగలు, శుభకార్యాలు, ఇతర అవసరాల సమయంలో బియ్యం వినియోగం పెరగడం. మిల్లింగ్ ఖర్చులు వరి ధాన్యాన్ని బియ్యంగా మార్చే మిల్లుల విద్యుత్, నిర్వహణ, కార్మికుల ఖర్చులు పెరగడం. ప్రభుత్వ విధానాలు కనీస మద్దతు ధర (మీ్రా), ధాన్యం కొనుగోళ్లు, నిల్వలు, దిగుమతిఎగుమతి విధానాల్లో మార్పులు మార్కెట్ ధరలను ప్రభావితం చేయడం.

ధరల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు..

మార్కెట్‌లో బియ్యం కృత్రిమ కొరత లేకుండా చూడాలి. అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలను అరికట్టాలి. ప్రభుత్వ గోదాముల్లో నిల్వలను అవసరమైనప్పుడు మార్కె ట్లోకి విడుదల చేయాలి. రైతులకు సాగు ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధర కల్పించాలి. పేద ప్రజలకు సబ్సిడీపై నాణ్యమైన బియ్యం అందించాలి. బియ్యం ధరల పెరుగుదలకు ఒకే కారణం ఉండదు. ఉత్పత్తి, సరఫరా, సాగు ఖర్చు లు, ప్రభుత్వ విధానాలు, మార్కెట్ పరిస్థితులు అన్నీ కలిసి ప్రభావం చూపుతాయి. బియ్యం ధరల సమస్యను కేవలం రిటైల్ ధరల నియంత్రణతో పరిష్కరించలేం. రైతుకు న్యాయ మైన ప్రతిఫలం అందించడం, మధ్యవర్తిత్వ ఖర్చులను తగ్గిం చడం, సరఫరా వ్యవస్థలో పారదర్శకత పెంచడం, వినియోగదారుడికి అందుబాటు ధరలో ఆహారం అందించడం సమాంతరంగా జరగాలి. వ్యవసాయ ఉత్పత్తి, మార్కెట్ నిర్వ హణ, వాతావరణ మార్పులకు అనుగుణమైన సాగు విధానా లపై ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసినప్పుడే ధరల హెచ్చు తగ్గులను సమర్థంగా ఎదుర్కోవచ్చు. రైతు సంక్షేమం, ఆహార భద్రత, వినియోగదారుల ప్రయోజనాలు పరస్పర విరుద్ధమైనవి కావు. సరైన విధానాలతో ఈ మూడింటి మధ్య సమతుల్యత సాధించడమే దీర్ఘకాలిక పరిష్కారం.

స్కూళ్లను గాలికొదిలి పేరు మార్పులా?



తెలంగాణ స్టేట్ సెకండరీ ఎడ్యుకేషన్ సొసైటీ పరిధిలో విద్యాశాఖకు అనుబంధంగా మాడల్ స్కూళ్లు నడుస్తున్నాయి. వీటిని తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా మార్చుతామంటూ ప్రభుత్వం రూ.787 కోట్లతో ప్రణాళికను రూపొందించింది. మాడల్ స్కూళ్లలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉన్నది. కానీ కొత్తగా ఒకటి నుంచి 5వ తరగతి వరకు ప్రవేశపెడుతామని ప్రభుత్వం చెప్తున్నది. ఒక్కో పాఠశాలకు రూ.3 కోట్ల చొప్పున రూ.582 కోట్లు అవసరమని విద్యాశాఖ అంచనా వేసింది. ఏఐఐబీ నుంచి తీసుకునే రుణంలో కొంత మాడల్ స్కూళ్లకు కేటాయిస్తామని పేర్కొన్నది. మాడల్ స్కూళ్ల కోసం మొత్తం రూ.787.54 కోట్లు కావాలని పేర్కొన్నది. అందులో ఏఐఐబీ రుణం నుంచి 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా 30 శాతం ఖర్చు చేయనున్నట్టు వెల్లడించింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులేవైనా వస్తే.. వాటిని సర్కార్ తన వాటాగా కేటాయించే యోచనలో ఉన్నది. సీఎస్ఆర్ నిధుల కోసం ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ పబ్లిక్ ట్రస్టును ఏర్పాటు చేసింది. ఒకవేళ సీఎస్ఆర్ నిధులు రాకుంటే ఈ ప్రతిపాదన చెట్టెక్కుతుందా? ప్రభుత్వం నుంచి స్పష్టతలేదు. మరోవైపు మాడల్ స్కూల్ టీచర్లు తమ 12 రకాల డిమాండ్లను పరిష్కరించాలని ఆందోళనకు సిద్ధమవుతున్నారు. పాఠశాల విద్యాశాఖలో మాడల్ స్కూళ్ల విలీనం, 010 హెడ్ ఆఫ్ అకౌంట్ ద్వారా వేతనాల చెల్లింపు, జీవోల అమలు, టీజీటీలకు నోషనల్ సర్వీస్, ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు వంటివి ప్రధానమైన డిమాండ్లు. తుది ఆర్థిక ప్రయోజనాలు చెల్లించడం, ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయడం కూడా ఉన్నాయి. ఇవన్నీ టీచర్ల దీర్ఘకాలిక ప్రయోజనాలకు సంబంధించిన అంశాలే తప్ప, తక్షణ ఆర్థిక భారంగా పరిగణించాల్సిన అవసరం లేదు. 194 మాడల్ స్కూళ్లలో మొత్తం 3,880 పోస్టులకు గాను 1,080 ఖాళీగా ఉన్నాయి. ఇందులో సుమారు 97 ప్రిన్సిపాల్, 560 పీజీపీ, 423 టీజీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ పోస్టుల భర్తీ జరగాలి. డీఏ బకాయిల పెండింగ్, సీపీఎస్ నిధుల సెటిల్మెంట్ చేయాలి. విద్యార్థులకు హాస్టల్ వసతి, రవాణా సౌకర్యం లేదు. బాలికలకు హాస్టల్ వసతులు అరకొరగా ఉన్నాయి. తాగునీరు, టాయిలెట్స్, ల్యాబ్, లైబ్రరీ సరిగా లేవు. కొన్ని స్కూల్స్ పక్కనే డంపింగ్ యార్డులు ఉండటం వల్ల పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రభుత్వం రూ.787 కోట్లతో చేపడుతామని చెప్తున్న ప్రణాళికలో పధానమైన సమస్యలేవీ పేర్కొనలేదు. రాష్ట్రంలో బాలికలకు ప్రత్యేకంగా 495 కేజీబీవీ విద్యాలయాలు, వివిధ గురుకులాలు రెసిడెన్షియల్ విధానంలో ఉన్నాయి. మాడల్ స్కూళ్లు తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ సొసైటీ పరిధిలో ఉండగా, కేజీబీవీలు సమగ్ర శిక్షా అభియాన్ పరిధిలో, గురుకులాలు ఐదు రకాల సొసైటీల నిర్వహణలో ఉన్నాయి. గురుకులాలు నేరుగా విద్యాశాఖతో సంబంధం లేకుండా ఉండగా, మాడల్ స్కూళ్లు, కేజీబీవీలు విద్యాశాఖకు అనుబంధంగా ఉన్నాయి. అయినప్పటికీ విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ లేదు. వీటిపై రాష్ట్ర విద్యాశాఖ, విద్య శిక్షణ పరిశోధనా సంస్థ అకడమిక్ వ్యవహారాల్లో ప్రత్యేక పర్యవేక్షణ ఏమీ లేదు. అకడమిక్ పర్యవేక్షణ లేకపోవడంతో విద్యాప్రమాణాల పరిశీలన, మూల్యాంకనం విద్యాశాఖతో సంబంధంలేని అధికారుల చేతుల్లో నడుస్తున్నాయి. ప్రభుత్వరంగంలోని పాఠశాలలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలు మాత్రమే విద్యాశాఖ పర్యవేక్షణలో ఉన్నాయి. అన్ని స్కూళ్లలో ఒకే సర్వీస్ నిబంధనలు లేకపోవడం చాలా సమస్యలకు దారి తీస్తున్నది.ప్రభుత్వం నిధుల కొరత సాకుతో మౌలిక వసతుల కల్పన కోసం సీఎస్ఆర్ నిధులను, అప్పుల ద్వారా పాఠశాలలను నిర్వహిస్తాననే మైండ్ సెట్ నుంచి బయటపడాలి. కొఠారి కమిషన్ సూచించినట్టుగా రాష్ట్ర బడ్జెట్‌లో 10% నిధులను విద్యకు కేటాయించి, పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించి, విద్యావ్యవస్థను పటిష్టం చేయాలి. ఉపాధ్యాయుల సర్వీసు సంబంధమైన సమస్యలతో పాటు, ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలి. పాఠశాల విద్యాశాఖను కాపాడడంతోపాటు, మాడల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేసి, సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి.

రూ.1.43 కోట్లతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం ప్రారంభం..

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం -- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి..

ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి స్థలం అందించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే..





నవంబర్ 4 మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి కొమిరే యాకయ్యమహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలో శఎ ఫైనాన్స్ నిధులు రూ.1.43 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని బుధవారం పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి మామిడాల యశస్విని రెడ్డి గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, రిబ్బన్ కట్ చేసి నూతన భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు పొందేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.పెద్దవంగర మండల కేంద్రంలో రూ.1.43 కోట్లతో నిర్మించిన ఈ నూతన భవనం ద్వారా మండల పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. నూతన భవనంలో అవసరమైన వైద్య సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ వైద్యులు, సిబ్బంది ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెరిగేలా వైద్య సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని కోరారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం కోసం విలువైన స్థలాన్ని అందించిన దాతలకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని సామాజిక ప్రయోజనం కోసం స్థలాన్ని అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని, స్థలదాతల సహకారం ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. ప్రజా అవసరాల కోసం ముందుకొచ్చి సహకరించిన దాతల సేవాభావాన్ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులు ప్రజలకు నేరుగా ఉపయోగపడేలా ఉండాలని, ప్రతి గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రంగు మురళి, స్థానిక సర్పంచ్ ముద్దసాని పారిజాతం సురేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నెహ్రూ నాయక్, వివిధ గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, డైరెక్టర్లు, పార్టీ మండల నాయకులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అంకిరావుపల్లి లో పశు పునరుత్పత్తి చికిత్స శిబిరం...

(యస్.పి. మల్లికార్జున సాగర్)



కొల్లాపూర్, నవంబర్ 4 నాగర్ కర్నూల్ జిల్లా పశు సంవర్ధక శాఖ సహకారం తో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కొల్లాపూర్ మండలం అంకిరావు పల్లి గ్రామం లో బుధవారం పశు పునరుత్పత్తి చికిత్స శిబిరం ను పశు వైద్యశాఖ అధికారులు నిర్వహించారు. ఇట్టి శిబిరం లో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన దూడల ప్రదర్శన కార్యక్రమం ను గ్రామ సర్పంచ సురేష్ , మాజీ సర్పంచ్ కృష్ణయ్య , రైతుల, పశు పోషకుల సమక్షం లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పశు వైద్యాధికారి డాక్టర్ జి. జె. పాల్ పశువులకి గర్భకోశ వ్యాధి చికిత్స నివారణ చికిత్సలు నిర్వహించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన దూడల ప్రదర్శనలో చూడలకు నటల నివారణ మందులు క్యాల్షియం మందులు విటమిన్ ఏ ఇంజక్షన్లు పశువులకు పశువైద్యాధికారులు ఇచ్చారు. ఈ సందర్భం గా డాక్టర్ మాట్లాడుతూఏ లి నో ప్రభావం ద్వారా పాడి రైతులు ఎదుర్కొనే సమస్యలను రైతులు అధిగమించాలని వారికి కావాల్సిన సూచనలు మరియు పశుగ్రాస సాగు గురించి తెలియజేశారు. పశువులను సరైన టైంలో ఎదకు వచ్చే విధం గా వారికి కావలసిన మినరల్ మిక్చర్ క్యాల్షియం మరియు నట్టల నివారణ మందులు ఇచ్చి వాటిని సరైన టైంలో ఎదకువచ్చే విధం గా చేసుకుంటే పాడు రైతులు ఆర్థికం గా బాగుపడతారని రైతులకు పశు వైద్యాధికారులు తెలియజేసారు. ఈ కార్యక్రమము లో గ్రామ సర్పంచి టి. సురేష్ , మాజీ సర్పంచ్ కృష్ణ , మండల పశు వైద్యాధికారి డాక్టర్ జిజే పాల్ , కారంగి నరసింహ, గోపాల మిత్ర సూపర్వైజర్ శ్రీనివాసులు, గోపాల మిత్రులు శివరాములు, శివుడు, సూరిబాబు, మైత్రినరసింహ, పాడి రైతులు పాల్గొన్నారు.

ప్రపంచ మత్స్యకార దినోత్సవ కార్య క్రమాన్ని విజయవంతం చేయాలి

(యస్.పి. మల్లికార్జున సాగర్).



కొల్లాపూర్, నవంబర్ 4, కొల్లాపూర్ పట్టణ (అసెంబ్లీ నియోజకవర్గ) కేంద్రం లో నవంబర్ 21 తేదీ నాడు నిర్వహించ బోయే ప్రపంచ మత్స్య కార దినోత్సవ కార్యక్రమం లో కొల్లాపూర్ అసెంబ్లీ నియోజక వర్గం లోని మత్స్యకారులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు మత్స్య కార్మిక సంఘం నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాసులు మత్స్యకారులకు విజ్ఞప్తి చేశారు. నవంబర్ 21న నిర్వహించే ప్రపంచ మత్స్యకార దినోత్సవ కార్యక్రమ నిర్వహణ కోసం బుధవారం కొల్లాపూర్ పట్టణం లోని శ్రీ గంగాభవాని ఆలయం లో కొల్లాపూర్ అసెంబ్లీ నియోజక వర్గ మత్స్య కార సంఘం అధ్యక్షుడు గడ్డి గోపుల శివప్రసాద్ ఆధ్వర్యం లో సమీక్ష సమావేశాన్ని మత్సకారులు నిర్వహించుకున్నారు. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా కొల్లాపూర్ అసెంబ్లీ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు , మత్స్య కార్మిక నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాసులు హాజరైనారు.సమావేశం లో డాక్టర్ పగిడాల శ్రీనివాసులు మాట్లాడుతూ కొల్లాపూర్ అసెంబ్లీ నియోజక వర్గం లోని ఏడు మండలాల మత్స్య సహకార సంఘ సొసైటీ అధ్యక్షులను గ్రామ సొసైటీ అధ్యక్షులను సభ్యులను మరియు కుల బంధవులను బహుజన బిడ్డలను అందర్నీ కలుపుకొని ఈ యొక్క మత్స్య కార సభను విజయవంతం తగిన సూచనలు కార్యక్రమాల గురించి చర్చించారు. నవంబర్ 21వ తేదీన కొల్లాపూర్ లో నిర్వహించనున్న ప్రపంచ మత్స్య కారా దినోత్సవం కార్యక్రమానికి కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని మత్స్య కార్మికులందరూ తరలివచ్చి ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ మత్స్య కార్మికుల ఐక్యతను చాటుకోవాలనిడాక్టర్ పగిడాల శ్రీనివాసులు మత్స్యకార సంఘ సభ్యులకు మత్స్యకార కుల బంధువులకు విజ్ఞప్తి చేస్తూ పిలుపునిచ్చారు. ఈ యొక్క కార్య క్రమం లో డి ఎఫ్ సి ఎస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు , కొల్లాపూర్ సింగిల్ విండో మాజీ చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య , దుర్గేష్ , కొమ్మ ఆంజనేయులు , ఉరి హరికృష్ణ, కొల్లాపూర్ పట్టణంలోని మత్స్య కార్మికులు వివిధ గ్రామాల నుండి వచ్చిన మస్త్య కార్మిక సంఘ నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

కరువుతో పంటలు ఎండిపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం అందించాలి

మంద పవన్, సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి



సిద్దిపేట నవంబర్ 4 కరువు పరిస్థితులు, సాగునీటి కొరత కారణంగా పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పంట నష్టపరిహారం అందించాలని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఈ.మంద పవన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.బుధవారం సీపీఐ బెజ్జం కిమండల కార్యదర్శి బోనగిరిరూపేష్ ఆధ్వర్యంలో సీపీఐ నాయకులతో కలిసి బెజ్జంకి మండలంలోని , ముత్తన్నపేట్ స్టేజి వద్ద గల వ్యవసాయ భూమి వరి పొలం లో ఎండిపోయిన వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట పొలాలను సందర్శించి పంట నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి పరిస్థితులను, సాగు కోసం పెట్టిన పెట్టుబడులు, ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ.. రైతులు ఎన్నో ఆశలతో అప్పులు చేసి, కుటుంబ అవసరాలను పక్కనపెట్టి, వ్యవసాయంపై నమ్మకంతో పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. పంట చేతికొచ్చే సమయంలో వర్షాభావ పరిస్థితులు, నీటి కొరత కారణంగా వరి పంటలు ఎండిపోవడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని పేర్కొన్నారు. ఎకరాల కొద్దీ సాగు చేసిన పంటలు కళ్లముందే ఎండిపోతుంటే రైతులు పడుతున్న బాధ వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు.వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడులు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులతో పాటు సాగునీటి కోసం చేసిన వ్యయం కూడా రైతులకు భారంగా మారిందని తెలిపారు. పంట దిగుబడి రాకపోవడంతో రైతులు పెట్టిన పెట్టుబడులు తిరిగి వచ్చే పరిస్థితి లేదని, మరోవైపు అప్పుల భారం పెరిగి భవిష్యత్తులో వ్యవసాయం కొనసాగించడమే కష్టంగా మారుతోందని అన్నారు.ఈ పరిస్థితుల్లో పంట నష్టపోయిన రైతులకు కేవలం ఓదార్పు సరిపోదని, వారి నష్టాన్ని కొంతమేర భర్తీ చేసేలా ఆర్థిక సహాయం అందించడం అత్యవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పర్వేద, కూరేళ్లతో పాటు నష్టపోయిన అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని కోరారు. పంట పూర్తిగా ఎండిపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందించి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా పంట నష్టపోయిన రైతులకు బ్యాంకు రుణాలు, వ్యవసాయ పెట్టుబడులు, తదుపరి పంట సాగు విషయంలో తగిన వెసులుబాటు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు తిరిగి వ్యవసాయం చేసుకునే ధైర్యాన్ని, భరోసాను కల్పించడం ప్రభుత్వ సహాయక చర్యల్లో ప్రధాన ప్రాధాన్యత కావాలని సూచించారు.రైతాంగం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, రైతు బాగుంటేనే వ్యవసాయ రంగం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతాయని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, కరువు పరిస్థితుల వల్ల రైతులు నష్టపోయినప్పుడు వారిని ఆదుకోవడం సమాజం, ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. మండలంలో పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులందరికీ తక్షణ న్యాయం జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, ఎకరాకు రూ.50 వేల పంట నష్టపరిహారం అందించాలని మంద పవన్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యెడల వనేశ్ సిపిఐ మండల సహాయ కార్యదర్శి పండగ కల్లూరి బాలమల్లు పరశురాములు సగం తిరుపతి,బోనగిరి శ్రవణ్,సాక్షి మండల కార్యదర్శి దొంతర వేణి మహేష్ ఏఐఎఫ్ మండల అధ్యక్షుడు రాకేష్ కనగండ్ల చంద్రయ్య కుంభం రాములు బర్ల రాజు చిన్న తిరుపతిరెడ్డి రామచ శేఖర్ కనగండ్ల కనకయ్య రొడ్డ చరణ్ తిరుపతి గొర్ల ఆంజనేయులు

రంగారెడ్డి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలి



కేశంపేట నవంబర్ 4, మండలంలోని రైతుల పంట పొలాలను పరిశీలించిన సిపిఐ ఎమ్మెల్సీ నెలికంటి సత్యం తీవ్రమైన వర్షాభావ కరువు పరిస్థితుల నేపథ్యంలో రంగారెడ్డి జిల్లాలో రైతులు వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయి తీవ్ర అవస్థలో ఉన్న రంగారెడ్డి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ నెలికంటి సత్యం డిమాండ్ చేశాడు బుధవారం నాడు రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యదర్శి పాలమాకుల జంగయ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు ఓరుగంటి యాదయ్య కే రామస్వామి ఎం యాదిరెడ్డి.బుద్ధుల జంగయ్య టి రామకృష్ణ జిల్లా కార్యవర్గ సభ్యులు సామెడి శేఖర్ రెడ్డి ఎం శ్రీను నాయక్ పల్నాటి యాదయ్య ఎం ప్రభు లింగం.పి శివకుమార్ ఎం పవన్ చౌహాన్ ఆర్ యాదగిరి వడ్ల సత్యనారాయణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి చంద్ర బాబు తదితర పార్టీ నాయకులతో కలిసి ఈరోజు కేశంపేట మండలం ఇప్పలపల్లి వేముల గ్రామాలను సందర్శించి ఎండిపోయిన. పత్తి మరియు వడ్ల చేను మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న తీవ్రమైన కరువు చాయలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ద్వారా రాష్ట్రాన్ని మొత్తం కరువు ప్రాంతంగా ప్రకటించే విధంగా ఒత్తిడి తేవాలని దీనికి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పక్షాలను కలుపుకొని సమన్వయంతో కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని ఆయన సూచించారు రాబోయే ఆరు నెలలు చాలా తీవ్రమైన గడ్డు పరిస్థితులు ప్రజలు ఎదుర్కొనే పరిస్థితి ఉన్నందున ప్రభుత్వాలు సాగునీటి వసతి కరెంటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అని ఆయన డిమాండ్ చేశారు అలాగే ఈ ఆరు నెలలు ప్రతి తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదవాడికి 10 కిలోల బియ్యం పప్పు దినుసులు సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశాడు ఎండిపోయిన మొక్కజొన్న పంటకు 15 వేల చొప్పున వరి పంటకు 30 వేల చొప్పున పత్తికి 50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు రైతులు బ్యాంకులలో పంటలు వేసుకోవడానికి తీసుకున్న రుణాలను మొత్తాన్ని ఏకకాలంలో రద్దు చేయాలని ఆయన కోరారు సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టు పూర్తి చేసి ఈ జిల్లాకు సాగునీరు త్రాగునీరు అందించాల్సిన ప్రాజెక్టును కాళేశ్వరం ప్రాజెక్టుతో దీనిని బొంద పెట్టారని ఆయన విమర్శించారు రంగారెడ్డి జిల్లాలో 27 మండలాలు కరువు పరిస్థితుల్లో ఉన్నందున మొత్తం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం.

సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండల వెంకన్నలి



నవంబర్ 4 మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి కొమిరే యాకయ్య దంతాలపల్లి పడమటి గూడెం స్టేజి వద్ద జెండావిష్కరణ నవంబర్ 1 నుండి 9 వరకు అమరవీరుల సంస్మరణ సభలను గ్రామ గ్రామాన నిర్వహించాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ శ్రేణులకు పిలుపునిచ్చారు. భారత విప్లవోద్యమంలో భూమి, భుక్తి, విముక్తి కోసం ప్రాణాలర్పించిన విప్లవ అమరవీరులకు ఘనంగా జోహార్లు అర్పించారు.ఈ సందర్భంగా దంతాలపల్లి మండలం పడమటి గూడెం స్టేజి వద్ద అమరుడు కామ్రేడ్ జక్కుల ఐలన్న స్తూపంపై పార్టీ జెండాను ఎగురవేసి సంస్మరణ సభ నిర్వహించారు. చిర్ర యాకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల వెంకన్న మాట్లాడుతూ.. అమరవీరులు దోపిడీ, పీడన, కులవివక్షత లేని సమసమాజ నిర్మాణం కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారని అన్నారు.స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప ప్రజల బతుకులు మారడం లేదని, నేటికీ భూమి సమస్య పరిష్కారం కాకపోగా ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలు, కులవివక్షత, స్త్రీ వివక్షత కొనసాగుతున్నాయని విమర్శించారు. అధికారం మారినంత మాత్రాన సమాజం మారదని, దోపిడీ వ్యవస్థ అంతమైనప్పుడే నిజమైన విముక్తి సాధ్యమవుతుందని అన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా వారు ఆశించిన సమసమాజ నిర్మాణం కోసం ప్రజలను సంఘటితం చేసి, ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న, . యాకసాయిలు, కొమరయ్య, లింగయ్య, సాయిలు సతీష్. మధు కుమార్ ఆదిరెడ్డి వెంకన్న ప్రశాంతు హరీష్ సంతు కొమరయ్య లింగయ్య ఉప్పలయ్య పరమేష్ ఏక సాయిలు సాయి యాకయ్య సురేష్ వెంకన్న శ్రీశైలం సతీష్ రాజేషు ఏకాంతం అనిల్ తదితరులు పాల్గొన్నారు

మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే "రాజీనామా" చేయాలి

(యస్.పి. మల్లికార్జున సాగర్).



కొల్లాపూర్, నవంబర్ 4,.కొల్లాపూర్ శాసనసభ్యులు, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే రాజీనామా చేయాలని బిజెపి పార్టీ కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు తమటం సాయి కృష్ణ గౌడ్ డిమాండ్ చేశారు.కొల్లాపూర్ అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రం లో బుధవారం ఆయన మాట్లాడుతూ దేశం లో ఓట్ల చోరీ ఎక్కడ జరిగిందో నిరూపించకుండానే ఓట్ల చోరీ జరిగిందని రాజకీయ లబ్ధి కొరకు ఆరోపణలు చేస్తున్నారని, దేశం లోని ప్రతిపక్షాలు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ ఓటు చోరీ గురించి మీరు చేస్తున్న ఆరోపణలు నిజమే అని నమ్మితే నాది సూటి ప్రశ్న కొల్లాపూర్ లో కొల్లాపూర్ శాసనసభ్యులు, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , కాంగ్రెస్ పార్టీ నాయకులు కొల్లాపూర్ లో "దొంగతనం" చేసినట్లు నాకు అనిపిస్తుంది దానికి భేషరతుగా "మంత్రి రాజీనామా" చేయాలి అని బిజెపి పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాము అని సాయి కృష్ణ గౌడ్ అన్నారు. దొంగతనం జరిగిందా...? లేదా...? అనేది కాంగ్రెస్ పార్టీ నాయకులే మంత్రి జూపల్లి కృష్ణారావు నిరూపించు కోవాలి అని లేని పక్షం లో మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే "రాజీనామా" చేయాలని డిమాండ్ చేస్తున్నానని సాయి కృష్ణ గౌడ్ అన్నారు.ఆరోపణలు చేయడం సులభం ఆధారాలతో నిరూపించడం ముఖ్యం అని ఓట్ల చోరీ జరిగిందని ఆరోపణలు అసత్య ప్రచారాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు ఓట్ల చోరీ ఎక్కడ జరిగిందో..? ఎలా జరిగిందో...? నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్యాన్ని కాపాడే వారు ప్రజల తీర్పును గౌరవించాలి, ఓటమి వచ్చినప్పుడల్లా వ్యవస్థను ప్రశ్నించడం కాదు! ఆధారాలు చూపించండి అని ఓట్ల చోరీ జరిగిందని ఆరోపణలు చేస్తూ అసత్య ప్రచారాలతో ఆందోళనలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులను తమటం సాయి కృష్ణ గౌడ్ డిమాండ్ చేశారు.

కరువు బారిన పడిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి

పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం ప్రకటించాలి.

సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి.



తెలకపల్లి నవంబర్ 4 తీవ్రమైన కరువు పరిస్థితుల కారణంగా వివిధ పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.సీపీఐ రాష్ట్ర కరువు పరిశీలన బృందం పల్లా వెంకటరెడ్డి నాయకత్వంలో నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనలో భాగంగా తెలకపల్లి,బల్మూరు, ఉప్పునుంతల అచ్చంపేట అమ్రాబాద్ పదర మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సాగు చేసి ఎండిపోయిన పంటలను సిపిఐ బృందం పరిశీలించింది.ప్రధానంగా వర్షాభావ పరిస్థితుల్లో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పత్తి పంటతోపాటు మిర్చి వివిధ రకాల ఖరీఫ్ పంటలు తీవ్రంగా ఎండిపోయి రైతులను నష్టపోయారని ఆయన అన్నారు.ఈ సందర్భంగా పంటల పరిస్థితిని, కరువు తీవ్రతను, రైతులు ఎదుర్కొంటున్న నష్టాలను రైతులను అడిగి తెలుసుకుంది.వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతిని రైతులు పెట్టిన పెట్టుబడులు సైతం తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని బృందం ఆవేదన వ్యక్తం చేసింది. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు పంట నష్టాలతో అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉందని పేర్కొంది.ప్రభుత్వాలు తక్షణమే కరువు మండలాలను గుర్తించి, పంట నష్టాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని, నష్టపోయిన ప్రతి రైతుకు ఎలాంటి జాప్యం లేకుండా న్యాయమైన నష్టపరిహారం అందించాలని సీపీఐ కరువు పరిశీలన బృందం డిమాండ్ చేసింది. అలాగే రైతులకు పంట నష్టపరిహారంతో పాటు రుణ ఉపశమనం, తదుపరి పంట సాగుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని కోరింది.రైతుల కష్టాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని, రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఐ వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని బృందం స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహ సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ సిపిఐ సమితి సభ్యులు కే కేశవులు గౌడ్ వి వెంకటయ్య సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి విజయ దు ఈ చంద్రమౌళి రైతు సంఘం జిల్లా కార్యదర్శి సూర్య శంకర్ గౌడ్ జిల్లా అధ్యక్షుడు బి శ్రీనివాసులు సిపిఐ జిల్లా సమితి సభ్యులు బి రవీందర్ బండి లక్ష్మీపతి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ పి ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి ప్రేమ్ కుమార్ టి మల్లేష్ పి గోపాల్ పరశురాం నరేందర్ రెడ్డి విష్ణు వంకేశ్వరం శ్రీనివాసులు కొత్త రామస్వామి ఎం ఆంజనేయులు శివకృష్ణ పి ధనంజయుడు రైతులు పర్వత్ రెడ్డి కృష్ణయ్య ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

జర్నలిస్టు కుటుంబానికి అండగా టి డబ్ల్యు జేఏ..

మానవత్వానికి మారుపేరుగా నిలిచిన జర్నలిస్టుల ఐక్యత..

మాతృమూర్తి మృతి పట్ల పరామర్శించి బియ్యం అందజేత!



నవంబర్ 4 మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి కొమిరే యాకయ్య కురవి మండలం జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా, ఆపదలో ఉన్న జర్నలిస్టు కుటుంబాలకు అండగా నిలుస్తూ మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ (టి డబ్ల్యూ జేఏ). తోటి జర్నలిస్టు కుటుంబంలో విషాదం చోటుచేసుకున్న సమయంలో అండగా నిలిచి, తమది కేవలం సంఘం మాత్రమే కాదు.. ఒక కుటుంబమని నిరూపించింది.టి డబ్ల్యూ జేఏ జిల్లా ఉపాధ్యక్షులు రాగం రవి మాతృమూర్తి రాగం లక్ష్మమ్మ మృతి పట్ల సంఘం నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రవి కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మాతృమూర్తి మూడవ రోజు కార్యక్రమం నిర్వహణకు 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కష్ట సమయంలో తాము అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని రవి కుటుంబానికి భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో టి డబ్ల్యూ జేఏ జిల్లా అధ్యక్షులు బానోత్ లక్ష్మణ్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుగులోత్ శ్రీనివాస్ నాయక్, రాష్ట్ర కమిటీ నాయకులు ఊకె సురేష్, అంగడి నర్సయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ మహేందర్, జిల్లా కమిటీ నాయకులు జిల్లా కార్యదర్శి బోడ శ్రీను, జిల్లా నాయకులు బానోత్ మోహన్ నాయక్, జిల్లా లీగల్ అడ్వైజర్ భూక్యా మోహన్, సోషల్ మీడియా స్టేట్ కన్వీనర్ తేజావత్ శ్రీను, జిల్లా ఉపాధ్యక్షులు శాంతి కుమార్‌తో పాటు టిడబ్ల్యూజేఏ కుటుంబ సభ్యులు, జిల్లా వర్కింగ్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

నర్సింహులపేట ఎంపీడీఓ కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యం

10:30 దాటినా రాని ఎంపీడీఓ , సూపరింటెండెంట్

కార్యాలయం ముందు పడిగాపులు కాస్తున్న ప్రజలు – పట్టించుకోని అధికార యంత్రాంగం

ఎంపీడీఓ కార్యాలయానికి ఆలస్యంగా అధికారులు



నవంబర్ 4 మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి కొమిరే యాకయ్యనర్సింహులపేట, మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. ఉదయం 10:30 గంటలు దాటినా ఎంపీడీఓ మరియు సూపరింటెండెంట్ అధికారులు కార్యాలయానికి రాలేదు.దీంతో వివిధ పనులపై వచ్చిన ప్రజలు కార్యాలయం ముందు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. ప్రభుత్వ కార్యాలయాల వేళలు పాటించకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పల్లె ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, వృద్ధులు అధికారుల కోసం ఎదురుచూడటం సర్వసాధారణంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ పథకాలు, పనులు ఆలస్యమవుతున్నాయని వాపోతున్నారు.సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు

చదువుకు శ్రీరామ్ ఫైనాన్స్ అండ

67 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు – ప్రతిభావంతుల భవిష్యత్తుకు ఆర్థిక భరోసా



నవంబర్ 4 మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి కొమిరే యాకయ్య పేదరికం ప్రతిభకు అడ్డు కాకూడదనే లక్ష్యంతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ విద్యార్థులకు అండగా నిలిచింది.సామాజిక బాధ్యతలో భాగంగా పట్టణానికి చెందిన 67 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.4,000 నుంచి రూ.4,500 వరకు స్కాలర్‌షిప్‌లు అందించి ప్రోత్సహించింది.హౌసింగ్ బోర్డు రెడ్డి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మహబూబాబాద్ బ్రాంచ్ మేనేజర్ పిరమళ్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జేసీబీ అధ్యక్షుడు గార్లపాటి మహిపాల్ రెడ్డి, మారుతి సుజుకి మేనేజర్ శ్రీనాథ్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు సహాయం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే తమ ఉద్దేశమని, వచ్చే ఏడాది మరింత మందికి స్కాలర్‌షిప్‌లు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హాల్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, బిజినెస్ మేనేజర్ మెరుగు భీమ్ రాజ్ తో పాటు సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ రవిశంకర్ కు నివాళులర్పించిన డాక్టర్ పగిడాల శ్రీనివాసులు...

(యస్.పి. మల్లికార్జున సాగర్).



కొల్లాపూర్, నవంబర్ 4 కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గము పెద్ద కొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామ నివాసి జర్నలిస్ట్ కర్నాటి రవిశంకర్ గౌడ్ కు కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాసులు నివాళులు అర్పించారు. ఇటీవల మృతి చెందిన జర్నలిస్ట్ రవి శంకర్ గౌడ్ దశదినకర్మ కార్యక్రమాలు బుధవారం రోజు కల్వకోలు గ్రామం లో జరిగినవి. ఇట్టి కార్యక్రమానికి డాక్టర్ పగిడాల శ్రీనివాసులు హాజరై దివంగత జర్నలిస్టు రవి శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు .అలాగే ఎద్దకొత్తపల్లి మండలం మారేడుమన్ దిన్నె గ్రామము లో విద్యుత్ మోటార్ ఆన్ చేయడానికి వెళ్లి ఇటీవల మృతి చెందిన పెబ్బేటి కేశవులు (25) దశదినకర్మ కార్యక్రమం లో కూడా డాక్టర్ పగిడాల శ్రీనివాసులు పాల్గొని కేశవులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. .కొల్లాపూర్ అసెంబ్లీ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాసులు వెంట జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు వాకిటి ఆంజనేయులు, గడ్డి గోపుల ఎల్లయ్య , గడ్డి గోపుల శివప్రసాద్ , కొమ్మ ఆంజనేయులు, దర్గేష్ సత్యనారాయణ ఉరి హరికృష్ణ తదితరులు పాల్గొని దివంగత జర్నలిస్టు రవిశంకర్ గౌడ్ కు, పెబ్బేటి కేశవులకు నివాళులు అర్పించారు.

ఘనంగా కుమురం భీం వర్ధంతి వారోత్సవాలు

స్మారక జెండా ఆవిష్కరణ.. విగ్రహానికి నివాళులర్పించిన ఆత్రం సుగుణక్క



ఆసిఫాబాద్, : నవంబర్ 4,జిల్లా రాజ్‌గోండ్ సేవా సమితి ఆధ్వర్యంలో కుమురం భీం స్మారక జెండా ఆవిష్కరణతో పాటు వర్ధంతి వారోత్సవాలను బుధవారం ఆసిఫాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ముఖ్య అతిథిగా హాజరై స్మారక జెండాను ఆవిష్కరించారు. అనంతరం కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ.. 'జల్, జంగల్, జమీన్' నినాదంతో ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప యోధుడు కుమురం భీం అని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తి, త్యాగాలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. కుమురం భీం ఆశయాల సాధనతో పాటు ఆదివాసీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. ఆయన చూపిన పోరాట బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అంకుసాపూర్ సర్పంచ్ టేకం గంగారాం, వగుదాం సర్పంచ్ జూగాదిరావు, సమేలా సర్పంచ్ సంతోష్, మాజీ ఎంపీపీ మోతిరాం, డీసీసీ కార్యవర్గ సభ్యుడు పెందూర్ సుధాకర్, శిడం అర్జు, మాడవి రఘునాథ్, గురునులే నారాయణ, ఉప్పుల కృష్ణ, బాజీరావు, మారుతి, చందన్ షా, జిల్లా రాజ్‌గోండ్ సేవా సమితి నాయకులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు

12 ఏళ్ల సాగునీటి సమస్యకు పరిష్కారం

300 ఎకరాలకు నీరందేలా చొరవ.. వసాకే హన్మంతుకు రైతుల సన్మానం



కాగజ్‌నగర్ : ,నవంబర్ 4, కోసిని గ్రామపంచాయతీ పరిధిలోని కోతులకుంట ప్రాంతంలో 300 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందించే చిన్న కాలువలు సక్రమంగా లేక రైతులు గత 12 ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు బుధవారం కాగజ్‌నగర్ మండల మాలి సంఘం ప్రధాన కార్యదర్శి వసాకే హన్మంతు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సంబంధిత అధికారులతో పలుమార్లు మాట్లాడి 300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేలా కృషి చేశారు. ఆయన ప్రయత్నాలతో నీరు అందడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోసిని సర్పంచ్ వసాకే పుల్లబాయి, రైతులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు కలిసి హన్మంతును ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల కష్టాన్ని తన కష్టంగా భావించి సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని గ్రామస్తులు కొనియాడారు. కార్యక్రమంలో రైతులు మల్లికార్జున్, రవి, రామయ్య, రవీందర్, శ్రీనివాస్, మోతిరావు, నవీన్, మమత, సుశీల, మోదంపూరి శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత సింగరేణి ఉద్యోగులకు రెండు రోజుల అవగాహన

ఇంటివద్దే పెన్షన్, వైద్య సేవల ధ్రువీకరణ పునరుద్ధరణపై శిక్షణ



?రెబ్బెన,నవంబర్ 4, డిజిటల్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 5.0లో భాగంగా విశ్రాంత సింగరేణి ఉద్యోగులకు ఈ నెల 16, 17 తేదీల్లో రెండు రోజుల పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీరమేష్ బుధవారం తెలిపారు. గోలేటి జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే కార్యక్రమంలో సీఎంపీఎఫ్, సీపీఆర్ఎంఎస్ పునరుద్ధరణ విధానాలపై సింగరేణి అధికారులు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఇప్పటివరకు విశ్రాంత ఉద్యోగులు పెన్షన్ కోసం జీవన్ ప్రమాణ్, వైద్య సేవల కోసం హెల్త్ కార్డు పునరుద్ధరణను మీ సేవా కేంద్రాల్లో చేయించుకుంటున్నారని తెలిపారు. ఇకపై మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటివద్దే తమ మొబైల్ ఫోన్ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేసుకునే విధానాన్ని వివరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి హాజరయ్యే వారు ఆధార్, జీవన్ ప్రమాణ్, సీపీఆర్ఎంఎస్ పత్రాల ప్రతులను వెంట తీసుకురావాలని, తద్వారా అక్కడికక్కడే పునరుద్ధరణ చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీఎం కోరారు.


విద్యార్థి అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

నవంబర్ 5 నుంచి 11 వరకు వర్ధంతి సభలు నిర్వహించాలి: పీడీఎస్‌యూ నాయకులు



ఆసిఫాబాద్: : నవంబర్ 4,విప్లవ విద్యార్థి ఉద్యమ వారసత్వాన్ని కొనసాగిస్తూ విద్యార్థి అమరవీరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీడీఎస్‌యూ ఆసిఫాబాద్ మండల ప్రధాన కార్యదర్శి జగజంపుల తరుణ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో బుధవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు షేక్ సమీర్, ప్రధాన కార్యదర్శి జగజంపుల తరుణ్ మాట్లాడుతూ.. శాస్త్రీయ విద్య, సమసమాజ స్థాపన లక్ష్యంగా నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరి లోయ రైతాంగ పోరాటాల స్ఫూర్తితో తెలుగు నేలపై విద్యార్థి ఉద్యమాలు నిర్మితమయ్యాయని తెలిపారు. విద్యారంగంలో సమూల మార్పులు, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు, సమాజంలోని వివక్ష నిర్మూలన కోసం పోరాడుతూ పలువురు విద్యార్థి నాయకులు అమరులయ్యారని పేర్కొన్నారు. పీడీఎస్ స్థాపకుడు జార్జిరెడ్డి, పీడీఎస్‌యూ నిర్మాత జంపాల చంద్రశేఖర ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలా శంకర్, స్నేహలత, రంగవల్లి తదితర అమరవీరులను స్మరిస్తూ నవంబర్ 5 నుంచి 11వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలు, వసతి గృహాల్లో వర్ధంతి సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అమరవీరుల స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద చర్యలు, విద్యార్థి వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని అన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ మండల నాయకులు వి. మహేందర్, శివశంకర్, కార్తీక్, అరవింద్, సాయి తదితరులు పాల్గొన్నారు

సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా జాదవ్ అంబాజీ అదనపు బాధ్యతలు



ఆసిఫాబాద్ నవంబర్ 04:కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిగా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జాదవ్ అంబాజీ బుధవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశాల మేరకు ఈ బాధ్యతలు అప్పగించారు.కార్యాలయానికి చేరుకున్న సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి సన్మానించారు.ఈ సందర్భంగా అంబాజీ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అంకితభావంతో పనిచేస్తూ శాఖ అభివృద్ధికి, విద్యార్థులు, లబ్ధిదారుల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చూస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో దండారి గుస్సాడి ప్రదర్శన



ఆసిఫాబాద్ నవంబర్ 04:ఆసిఫాబాద్ జిల్లాలో జనజాతి గౌరవ దివస్ వేడుకల నాల్గవ రోజు సందర్భంగా కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల బాలురులో దండారి గుస్సాడి సాంస్కృతిక కార్యక్రమం ఘనంగా జరిగింది. గిరిజన ఆచార వ్యవహారాలు, సంస్కృతి, కళారూపాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది.ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ ప్రత్యేక పూజలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాకారుల సంప్రదాయ వేషధారణలు, నృత్యాలు, వాయిద్యాల నడుమ సాగిన గుస్సాడి ప్రదర్శనలను తిలకించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, గిరిజన సంస్కృతి ఎంతో ప్రాచీనమైనదని, దండారి, గుస్సాడి వంటి కళారూపాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యార్థులు బిర్సా ముండా, కొమురం భీమ్, కుమారం సూరు వంటి గిరిజన పోరాట యోధుల చరిత్రను తెలుసుకొని, వారి త్యాగాలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చదువుతో పాటు మూలాలను మరచిపోకుండా గిరిజన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి మడావి శేఖు, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, లింబారావు, వార్డెన్ మధుకర్, ఎస్‌సీఆర్‌పీ రాథోడ్ రవీందర్, రాజ్ గోండ్ సేవా సమితి నాయకులు నానేష్, సిడాం కైలాష్, మనీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

టైగర్ నల్లా నరసింహులు స్ఫూర్తితోనే బీసీల వాటా సాధన!


మంచిర్యాల, , నవంబర్ 04...?చరిత్ర అంటే కేవలం అధికార పీఠాల మార్పిడో, గెలిచిన రాజుల విజయగాథలో మాత్రమే కాదు. అణచివేతపై తిరుగుబాటు జెండా ఎగరేసి, పీడిత ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రాణాలొడ్డిన సామాన్యుల సాయుధ చరిత్ర. ఆ చరిత్ర పుటల్లో నిత్యం ప్రజ్వలించే విప్లవాగ్ని పేరు 'టైగర్' నల్లా నరసింహులు. భూస్వామ్య దోపిడీని, నిజాం నిరంకుశత్వాన్ని, రజాకార్ల నెత్తుటి దాహాన్ని గడ్డపారల్లాంటి కండలతో ఎదురొడ్డి నిలిచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సింహం ఆయన. నేడు సమాజంలో సగభాగమైన బహుజనులు, బీసీ వర్గాలు తమ న్యాయమైన వాటా కోసం సాగిస్తున్న పోరాటాలకు నల్లా నరసింహులు జీవితం తిరుగులేని రాజకీయ, సామాజిక చైతన్య పాఠం.

చేనేత మగ్గం నుంచి సాయుధ గర్జన దాకా...

1926 అక్టోబర్ 2న నేటి జనగామ జిల్లా కడవెండి గ్రామంలో నిరుపేద పద్మశాలి చేనేత కుటుంబంలో లచ్చయ్య, లచ్చమ్మ దంపతులకు జన్మించారు నరసింహులు. చదివింది ఏడో తరగతే అయినా, సమాజం ఆయనకు నేర్పిన పాఠాలు విశ్వవిద్యాలయాలకు మించినవి. విసునూరు దేశ్‌ముఖ్ దౌర్జన్యాలు, వెట్టిచాకిరీ, తండ్రిని బలిగొన్న భూస్వామ్య రాక్షసత్వం ఆ యువకుడిలో తిరుగుబాటు అగ్నిని రగిలించాయి. మగ్గం గుంజలను వదిలి, పీడిత ప్రజల గొంతుకగా మారిన నరసింహులును భువనగిరిలో జరిగిన 11వ ఆంధ్ర మహాసభ మరింతగా ఉద్యమ బాట పట్టించింది. గ్రామగ్రామాన దళాలను నిర్మించి, భూస్వాముల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు.

ఉరికంబం సైతం వణికే తెగువ

1946--51 నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నల్లా నరసింహులు జనగామ ప్రాంత దళపతిగా చూపిన శౌర్యం అనితరసాధ్యం. 'దున్నేవాడికే భూమి', 'వెట్టిచాకిరీ అంతం' అనే నినాదాలతో గెరిల్లా పోరాటాన్ని నడిపిన ఆయన ధైర్యాన్ని చూసి



ప్రజలు ముద్దుగా 'తెలంగాణ టైగర్' అని పిలుచుకున్నారు. ఆ పేరు వింటేనే రజాకార్లు, జమీందారుల తొత్తులకు వెన్నులో వణుకు పుట్టేది.ఉద్యమ ప్రస్థానంలో ఎన్నో చిత్రహింసలు, నిర్బంధాలు ఎదుర్కొన్న ఆయన ఏకంగా మూడుసార్లు మరణశిక్షను ముద్దాడే పరిస్థితి వచ్చినా ఇంచు కూడా వెనకడుగు వేయలేదు. న్యాయస్థానాల బోనులో నిలబడి సైతం నిరంకుశ పాలనపై విప్లవ నినాదాలు వినిపించిన యోధుడు. సుదీర్ఘ పోరాటాలు, న్యాయపోరాటాల అనంతరం 1959 జనవరి 26న ఆయన జైలు నుంచి విడుదలయ్యారు.

త్యాగాల దాంపత్యం -- భావితరాలకు చారిత్రక

దర్పణం

నరసింహులు వ్యక్తిగత జీవితం కూడా ప్రజా ఉద్యమంతోనే పెనవేసుకుపోయింది. ఆయన జీవిత భాగస్వామి వజ్రమ్మ కేవలం భార్యగా మాత్రమే కాక, అజ్ఞాతంలో ఉద్యమ సహచరిగా అడుగులు వేశారు. తీవ్రమైన నిర్బంధాల నడుమ, జైలు గోడల మధ్యే ఒక ఆడబిడ్డకు జన్మనిచ్చిన వజ్రమ్మ త్యాగం పోరాట చరిత్రలోనే అరుదైన ఘట్టం.?కేవలం తుపాకీ పట్టిన యోధుడిగానే కాకుండా, తానెదుర్కొన్న అనుభవాలను 'తెలంగాణ సాయుధ పోరాటం - నా అనుభవాలు' గ్రంథం ద్వారా అక్షరబద్ధం చేసిన రచయితగా నరసింహులు భావితరాలకు అమూల్యమైన చరిత్రను అందించారు. ఆ గ్రంథం నాటి పోరాట వీరుల త్యాగాలకు సజీవ సాక్ష్యం.

వర్తమాన బీసీ ఉద్యమాలకు మార్గదర్శి

1993 నవంబర్ 5న నల్లా నరసింహులు భౌతికంగా దూరమైనా, ఆయన ఆలోచనలు అజరామరం. నేడు నవంబర్ 5న ఆయన వర్ధంతిని స్మరించుకుంటున్న వేళ, ఆయన జీవితం ఇచ్చే పిలుపు ఒక్కటే---హక్కులు అడిగితే రావు, సంఘటితమై పోరాడితేనే దక్కుతాయి.?అత్యధిక జనాభా కలిగిన వెనుకబడిన తరగతులు (బీసీలు) నేటికీ రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో తమ న్యాయమైన వాటా కోసం నిరీక్షిస్తూనే ఉన్నారు. నిరంకుశ వ్యవస్థపై తిరుగుబాటు చేసిన ఒక చేనేత కార్మికుడి తెగువను ఆదర్శంగా తీసుకుని, ప్రజాస్వామ్యబద్ధంగా చట్టసభల్లో, పాలనా వ్యవస్థల్లో బీసీల వాటాను కైవసం చేసుకునేందుకు విస్తృత ఐక్య పోరాటాలు నిర్మించడమే 'తెలంగాణ టైగర్' నల్లా నరసింహులుకు మనం అర్పించే నిజమైన నివాళి.సింగరేణిలో రాజుకున్న నిరసన జ్వాలలు ఆర్ జి -2 జీఎం కార్యాలయం ముట్టడి దిగ్విజయం..23 డిమాండ్ల అమలుపై యాజమాన్యం నిర్లక్ష్యం వీడకుంటే సమ్మె తప్పదు..ఏఐటీయూసీ హెచ్చరిక

సింగరేణిలో రాజుకున్న నిరసన జ్వాలలు

ఆర్ జి -2 జీఎం కార్యాలయం ముట్టడి

దిగ్విజయం..23 డిమాండ్ల అమలుపై

యాజమాన్యం నిర్లక్ష్యం వీడకుంటే సమ్మె తప్పదు..

ఏఐటీయూసీ హెచ్చరికగోదావరిఖని,, నవంబర్ 04..సింగరేణి కార్మికులతో కుదుర్చుకున్న ఒప్పందాలను అమలు చేయడంలో యాజమాన్యం అనుసరిస్తున్న మొండి వైఖరిపై కార్మిక లోకం భగ్గుమంది. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ పిలుపు మేరకు బుధవారం సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల జీఎం కార్యాలయాల ఎదుట చేపట్టిన ధర్నా కార్యాచరణలో భాగంగా ఆర్ జి -2 జనరల్ మేనేజర్ కార్యాలయ ముట్టడి తీవ్ర ఉద్రిక్తత, భారీ నిరసనల నడుమ విజయవంతమైంది. వేలాదిగా తరలివచ్చిన కార్మికులు యాజమాన్య వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పరిపాలనా భవనాన్ని ముట్టడించి, జీఎంకు సమగ్ర డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.?ఈ ముట్టడి కార్యక్రమం ఆర్ జి -2 బ్రాంచ్ కార్యదర్శి గంధం సాంబశివరావు అధ్యక్షతన జరగగా, ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కందుకూరి రాజారత్నం కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు.

హామీలు గాలికి... సమస్యలు గల్లీకి: రాజారత్నం ధ్వజం ..

యాజమాన్యం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని కందుకూరి రాజారత్నం మండిపడ్డారు. "గత ఏడాది లేబర్ కమిషనర్ సమక్షంలో సుదీర్ఘ చర్చలు జరిపి 23 ప్రధాన డిమాండ్లపై ఒప్పందం కుదుర్చుకున్నాం. కానీ క్షేత్రస్థాయిలో ఆ



ఒప్పందాలు కాగితాలకే పరిమితమయ్యాయి. నిరసనలు తెలిపినా స్పందించకపోవడంతోనే కార్మికులు రోడ్డెక్కాల్సి వచ్చింది" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

పధాన డిమాండ్లు ఇవే:

మూడు నెలలు మాత్రమే నిర్వహించి అర్థాంతరంగా నిలిపివేసిన మెడికల్ బోర్డులను ప్రతి నెలా క్రమం తప్పకుండా నిర్వహించాలి. అనర్హులుగా తేలిన వారి కుటుంబసభ్యులకు నిబంధనల ప్రకారం వెంటనే ఉద్యోగావకాశాలు కల్పించాలి.2022 నాటి ఒప్పందం, ప్రభుత్వ కమిటీ నివేదికలు పూర్తయినా పెండింగ్‌లోనే ఉన్న మారుపేర్ల సమస్యను పరిష్కరించి, అర్హులైన అభ్యర్థులకు (ముఖ్యంగా 35-40 ఏళ్ల వయస్సు గలవారికి) తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలి.అన్ని అర్హతలుండి వేచిచూస్తున్న డిపెండెంట్ అభ్యర్థులకు ప్రభుత్వ అనుమతుల పేరిట కాలయాపన చేయకుండా వెంటనే నియామక పత్రాలు అందజేయాలి.ఎన్నో ఏళ్లుగా ప్రచారానికే పరిమితమైన కార్మికుల 'సొంత ఇంటి పథకాన్ని' కాలయాపన లేకుండా అమల్లోకి తేవాలి.గనుల్లో బొగ్గు ఉత్పత్తికి, రక్షణకు అత్యంత కీలకమైన సేఫ్టీ బూట్లు, హెల్మెట్లు, డ్రిల్ రాడ్లు, ఎస్ డి ఎల్/ఎల్ హె డి యంత్రాలు, స్పేర్ పార్ట్‌ల కొరత తీవ్రంగా ఉంది. సరైన పరికరాలు లేకపోవడం వల్ల కార్మికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లడంతో పాటు ఉత్పత్తి పడిపోతోంది; వెంటనే నాణ్యమైన పరికరాలు సరఫరా చేయాలి.విద్యుత్ సంస్థలైన టీజీ జెన్కో, టీజీ ట్రాన్స్‌కో ల నుంచి సింగరేణి సంస్థకు రావాల్సిన సుమారు ?59,000 కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని వెంటనే విడుదల చేయించాలి.

సీఎండీ జోక్యం చేసుకోకుంటే సమ్మె సైరన్!

సంస్థ చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ తక్షణమే ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని, అధికారులను ఆదేశించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఏఐటీయూసీ నేతలు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఉత్పత్తిని స్తంభింపజేస్తూ సమ్మె బాట పట్టక తప్పదని స్పష్టం చేశారు.ఈ ముట్టడి కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శులు శ్యాంసన్, ఆవుల రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు మామిడి మహేందర్, బోట్ల సంపత్, పిట్ సెక్రటరీలు మోటపలుకుల మహేందర్, సెగ్గం శంకర్, రోహిత్ రెడ్డి, అనిల్, కుమారస్వామి, తాళ్ళపల్లి నారాయణ, వెంకటేష్, సహాయ కార్యదర్శులు అల్లి రమేష్, సాదరి రమేష్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ రాకేష్, వెంకటేష్ లతో పాటు నాయకులు సిహెచ్. కిషోర్ బాబు, కుంట తిరుపతి, లక్ష్మీనారాయణ, మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు

చెరువుల సంరక్షణ, అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

అధికారులతో సమీక్ష

అటవీ భూములను సంరక్షించాలి

రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి) నవంబర్ 04అటవీ శాఖ అధికారులు అటవీ భూములను సంరక్షించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.అటవీ భూములు, వన్యప్రాణుల సంరక్షణ, చెరువుల సంరక్షణ, అభివృద్ధి, సిట్ నియామకం తదితర అంశాలపై అటవీ శాఖ, పోలీస్, రెవెన్యూ, నీటి పారుదల, మత్స్య, వ్యవసాయ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సంబంధిత అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి .గితే, జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ నియామకం, అటవీ భూముల ఆక్రమణలపై చర్యలు, అటవీ భూములకు సంబంధించిన సమస్యలు, ఆక్రమణలు, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల రికార్డుల పరిశీలన, భూముల సరిహద్దుల గుర్తింపు తదితర అంశాలపై చర్చించారు.

వాస్తవ అటవీ భూములను గుర్తించాలి

అటవీ భూములకు సంబంధించిన రికార్డులు, పట్టా భూములు, ప్రభుత్వ భూముల వివరాలను క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను గుర్తించాలని, ఫారెస్ట్, రెవెన్యూ భూముల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల అధికారులు సంయుక్తంగా భూముల సరిహద్దులను పరిశీలించడం, జాయింట్ సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. జిల్లాలోని అటవీ శాఖ భూములు, వన్యప్రాణులను అటవీ శాఖ అధికారులు



సంరక్షించాలని సూచించారు. భూములు ఆక్రమించే వారిపై.. జంతువులను వేటాడే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీ భూములను కబ్జా నుంచి కాపాడాలని, రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అటవీ భూముల్లో మొక్కలు నాటాలని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు దోహదం

చెరువుల నీరు నిల్వ ఉండే భూములు ప్రకృతి సమతుల్యతలో కీలకమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయా వనరులు భూగర్భ జలాల పెరుగుదలకు, పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 157 వెట్ ల్యాండ్స్ గుర్తించామని వెల్లడించారు.ఆయా వెట్ ల్యాండ్స్ హద్దులు, పూర్తి విస్తీర్ణం, ఎఫ్ టీ ఎల్ ను రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, అటవీ శాఖ, నీటి పారుదల ఇతర శాఖల సమన్వయంతో సర్వే, మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయాలని సూచించారు. వాటి అభివృద్ధి కోసం అటవీ శాఖకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. దీంతో వలస, స్థానిక పక్షులు, జంతువులకు ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే పర్యాటక రంగం అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తు లో చెరువులు కబ్జా నుంచి రక్షించవచ్చని స్పష్టం చేశారు. మొక్కల, చేపల పెంపకం, పర్యాటక అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

ముందస్తు సమాచారం ఇవ్వాలి

అటవీ శాఖ భూముల్లో మొక్కలు నాటే.. ఇతర కార్యక్రమాల నిర్వహణపై తమకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. అటవీ భూముల ఆక్రమణ ఇతర అంశాలపై అటవీ శాఖ తో కలిసి బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, ఆర్ డిఓ కె ఎస్ బి కుమారి, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, నీటి పారుదల శాఖ అధికారి దయాకర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఎఫ్ఆర్ఓలు నాగేశ్వర్ రావు, శీతల్, మున్సిపల్ కమిషనర్ లు లోకేష్, ఖదీర్ పాషా, ఆయా శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

పదో తరగతిలో 100 శాతం ఫలితాలకు కృషి చేయాలి

ఏసీఎంఓ



ఆసిఫాబాద్ నవంబర్ 04:కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలోని కుంటలమానేపల్లి ఆశ్రమ పాఠశాల, టీడబ్ల్యూపీఎస్ కుంటలమానేపల్లి, అందుగులగూడ, పర్దంగుడ, అందుగులగూడ లంబాడి తండా, సులుగుపల్లి పాఠశాలలను బుధవారం ఏసీఎంఓ ఉద్దవ్ సందర్శించారు. విద్యాబోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, పదో తరగతి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు.పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా రూపొందించిన 100 రోజుల ప్రత్యేక ప్రణాళికను ఉపాధ్యాయులు తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, రోజువారీ స్లిప్ టెస్టులతో విద్యార్థుల స్థాయిని అంచనా వేయాలని చెప్పారు. డిసెంబర్ నెలాఖరు నాటికి సిలబస్ పూర్తిచేసి, అనంతరం పునశ్చరణ తరగతులపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.అనంతరం టీడబ్ల్యూపీఎస్ కుంటలమానేపల్లి ఉపాధ్యాయుడు సంతోష్‌పై పత్రికల్లో వచ్చిన వార్తలకు సంబంధించి విచారణ చేపట్టారు. విచారణ నివేదికను డీడీటీడబ్ల్యూ ద్వారా ప్రాజెక్ట్ అధికారికి సమర్పించినట్లు తెలిపారు.వివిధ పాఠశాలల్లో విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. బోధనా విధానాలను మెరుగుపరుచుకుంటూ గిరిజన విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని కోరారు.పర్యటనలో ఎస్ఆర్‌పీలు వెంకటేశ్, నందారాం, కుంటలమానేపల్లి ప్రధానోపాధ్యాయులు పరిశరాం తదితరులు పాల్గొన్నారు.

దండారి దర్బార్ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

దేవాపూర్ సల్పలవాగులో ఆదివాసీల సంప్రదాయ వేడుకలు



బెల్లంపల్లి, : నవంబర్ 4,కాసిపేట మండలంలోని దేవాపూర్ సల్పలవాగు ప్రాంతంలో నిర్వహించిన ఆదివాసీల సంప్రదాయబద్ధమైన దండారి దర్బార్ ఉత్సవాలకు బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదివాసీ పెద్దలు, స్థానిక నాయకులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కాసిపేట మండల అధ్యక్షుడు రమణారెడ్డి, దేవాపూర్ సిమెంట్ కంపెనీ యూనియన్ అధ్యక్షుడు సత్యపాల్‌రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఆదివాసీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రూ. లక్ష విలువైన 2 కిలోల గంజాయి స్వాధీనం

ముగ్గురు యువకుల అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు



నవంబర్ 4 మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి కొమిరే యాకయ్య మరిపెడ: గంజాయి విక్రయించేందుకు చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేస్తున్న ముగ్గురు యువకులను మరిపెడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి సుమారు రూ.లక్ష విలువైన 2 కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, డిజిటల్ వెయింగ్ మెషిన్ స్వాధీనం చేసుకున్నారు. మరిపెడ ఎస్సై గంద్రాతి సతీష్ తన సిబ్బంది హెచ్‌సీలు శ్రీనివాస్, రాజు, పీసీలు రవీందర్, రమేష్, వెంకన్నలతో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా తొర్రూరు రోడ్డులోని మరిపెడ శివారు డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని పట్టుకొని విచారించారు. వారి వద్ద ఉన్న బ్యాగులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. నిందితులు పవార్ విజయ్ (20) మరిపెడ, కంది అభిరామ్ దమరాచపల్లి గ్రామం భూపాలపల్లి జిల్లా, బానోత్ మణిదీపక్ సూర్యాపేటకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి మరిపెడ, మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం ప్రాంతాల్లో విక్రయించేందుకు సిద్ధం చేస్తున్నట్లు నిందితులు వెల్లడించారు. దీంతో గంజాయి, సెల్‌ఫోన్లు, డిజిటల్ వెయింగ్ మెషిన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

గంజాయి విక్రయాలు, రవాణా చేస్తే కఠిన చర్యలు

మత్తు పదార్థాల విక్రయం, గంజాయి రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. గంజాయి సంబంధిత సమాచారం అందించిన వారికి రూ.5,000 నగదు బహుమతి అందజేస్తామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మహబూబాబాద్ నవంబర్ 4 ప్రతినిధి యాకయ్య పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మరియు టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి గార్ల ఆదేశానుసారం బాధితుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించిన తొర్రూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మడిపల్లి: గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు జక్కన్న గారి ప్రియ శిష్యులు మాంకాల రమేష్ గారి మామగారు కాశీబుగ్గ వాస్తవ్యులు గారు పగిడి పెళ్లి మల్లేష్ గారు వరంగల్ కాశి బుగ్గ లో పరమపదించగా నేడు లితొర్రూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మడిపల్లి గ్రామ మాజీ ఎంపిటిసి జక్కన్న మహబూబ్ రెడ్డి మరియు తొర్రూర్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జక్కా ఇంద్రసేన రెడ్డి గార్లు వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి బాధితుని కుటుంబానికి ఆర్థిక సహాయం గా 3000 వేల నగదు మరియు 25 కేజీల బియ్యాన్ని అందించారు. అనంతరం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మరియు టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి గార్ల సహకారంతో అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు మాంకాల దేవేందర్ , మాంకాల అశోక్ ,మంకల వెంకటేశ్వర్లు, వేల్పుల నాగరాజు, వేల్పుల బాబు,బండ యాకయ్య ,కొండేటి బాబు, వేల్పుల కుమార్ ,యం .నరేష్ , సింగారపు బన్నీ,యం సతీష్, కొండేటి దర్గసామి,యం . సురేష్,యం . రాజేందర్, వేల్పుల బాబు,గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున మహిళలు, యువకులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

మహిళా సమైక్య భవనానికి భూమి పూజ

మహిళా సంఘాల బలోపేతానికి ప్రత్యేక వేదిక

భవన నిర్మాణానికి భూమి విరాళం.. దాతల కుటుంబానికి అభినందనలు



నవంబర్ 4 మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి కొమిరే యాకయ్య నర్సింహులపేట మండలం మహిళా సంఘాల కార్యకలాపాలకు శాశ్వత వేదిక కల్పించే దిశగా మండలంలోని ముంగిమడుగు గ్రామంలో మహిళా సమైక్య భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ దొంతు శారద రవి బుధవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దొంతు శారద రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంతో భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మహిళా సమైక్య భవన నిర్మాణం కోసం భూమిని విరాళంగా అందించిన దప్పుకాటీ మాల్సూరు, మాణిక్యం కుటుంబ సభ్యులను సర్పంచ్ దొంతు శారద రవి, ఉపసర్పంచ్ దొంతు మహేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మహిళా సంఘాల సమావేశాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలపై నిర్ణయాలు, ఆర్థిక లావాదేవీలు, సమాఖ్య కార్యకలాపాల నిర్వహణకు ఈ భవనం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులకు ఒకే వేదికపై సమావేశమై తమ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. భవన నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి మహిళా సంఘాలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధిలో భాగస్వాములవుతూ మహిళా సమైక్య భవనానికి భూమిని విరాళంగా అందించిన కుటుంబ సభ్యుల సేవలు అభినందనీయమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాడిపల్లి నాగముణి, పీఆర్ ఏఈ సుగుణాకర్, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి నివాస్, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇండియన్ ఆయిల్ సరికొత్త

బిజినెస్ స్ట్రాటజీ మరో వ్యాపారంలోకి గ్రాండ్ ఎంట్రీ

ఇండియన్ ఆయిల్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ బాటిళ్లను తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. త్వరలోనే ఈ కొత్త వ్యాపారంలోకి అడుగుపెట్టనుంది. ఇప్పటికే అగ్రిగేటర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. తొలుత హైవేల పక్కన ఉండే అవుట్ లెట్లలో వీటిని ప్రారంభించాలని యోచిస్తోంది. ప్రముఖ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. మరో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టింది. ఇప్పటివరకు కేవలం పెట్రోల్, డీజిల్ విక్రయాల రంగంలోనే ఉండగా.. ఇప్పుడు మరో బిజినెస్‌లోకి అడుగుపెట్టింది. అదే ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ బిజినెస్. ఇండియన్ ఆయిల్ బ్రాండ్ పేరుతో డ్రింకింగ్ వాటర్ బాటిళ్లను తీసుకురానుంది. దేశవ్యాప్తంగా ఉన్న 43 వేలకుపైగా తమ రిటైల్ అవుట్‌లెట్లలో ఈ వాటర్ బాటిళ్లను అందుబాటులోకి ఉంచి విక్రయించనుంది. ఇంధనం విక్రయంతోనే కాకుండా ఇతర ఆదాయ మార్గాలను కూడా ఇండియన్ ఆయిల్ అన్వేషిస్తోంది. తమ ఆదాయాన్ని మరింత పెంచుకోవాలని చూస్తోంది. ఈ క్రమంలో ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ బాటిళ్లను తీసుకురావాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ భావిస్తోంది. అంతేకాకుండా ప్రజలను నాణ్యమైన ఉత్పత్తులను అందించాలనే లక్ష్యంతో వీటిని తీసుకొస్తుంది. తొలుత హైవేలపై ఈ వ్యాపారాన్ని మొదలుపెట్టనుండగా.. ఆ తర్వాత నగరాలు, పట్టణాల్లో తీసుకురానున్నారు. అనంతరం పాక్షిక పట్టణ కేంద్రాలకు విస్తరించనున్నారు. పెట్రోల్ బంకుల్లో ఈ వాటర్ బాటిళ్లను విక్రయించున్నారు. దీంతో ప్రజలు వీటిని పెట్రోల్ పంప్‌ల వద్ద కొనుగోలు చేయవచ్చు. వాటర్ బాటిళ్ల తాయరీ, నాణ్యత, సరఫరా చేయడం, లాజిస్టిక్స్ నిర్వహణ, విస్తరణ కోసం అగ్రిగేటర్లుగా వ్యవహరించడానికి సంస్థలను ఆహ్వానిస్తోంది. బ్రాండ్ ఇండియన్ ఆయిల్ వద్దనే ఉంటుంది. భాగస్వాములు ఆమోదించిన కేంద్రాల నుంచే పూర్తిస్థాయి అమలును నిర్వహిస్తారు. అగ్రిగేటర్ల నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. తొలుత 21,435 హైవే రిటైల్ అవుట్ లెట్లలో ఇది ప్రారంభమవుతుంది. జాతీయ రహదారులపై ప్రయాణం చేసేందుకు వాటర్ కోసం చాలామంది వెతుకుంటూ ఉంటారు. దీంతో వారికి ఉపయోకరకంగా ఉండేందుకు తొలుత హైవేల పక్కన ఉంటే అవుట్ లెట్లలో ప్రారంభించనున్నారు. అనంతరం పట్టణాల్లో వ్యాపారం స్టార్ట్ చేయనున్నారు. లీటర్ ప్యాక్‌తో పాటు 250 ఎంఎల్, 500 ఎంఎల్ సైలు బాటిళ్లను కూడా ప్రవేశపెట్టనున్నారు. ప్రీమియం వాటర్ బాటిళ్లతో పాటు సహజ మినరల్ వాటర్, ఆల్కలైన్ వాటర్, ఫంక్షనల్ హైడ్రేషన్ ఉత్పత్తులను కూడా తీసుకురావాలని భావిస్తోంది.

రూ.6.35 కోట్లు పెట్టుబడి యాప్‌లో
రూ. 2 కోట్ల లాభం! చివరకు షాక్



స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని ఆశించాడు. సోషల్ మీడియాలో పరిచయమైన వ్యక్తి చెప్పిన మాటలు నమ్మాడు. తొలుత చిన్న మొత్తాలతో ట్రేడింగ్ నేర్చుకున్నాడు. ఆ తర్వాత అప్పులు చేసి మరీ కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టాడు. అతని ఖాతాలో భారీ లాభాలు కనిపించాయి. కానీ డబ్బులు వెనక్కి తీసుకునే సమయానికి అసలు కథ మొదలైంది. విత్‌డ్రా బటన్ నొక్కగానే ఎర్రర్! చివరకు ఫోన్ కూడా ఎత్తలేదు. దీంతో కోట్ల రూపాయల మోసం జరిగిందని ఆరోపిస్తూ ఎకనామిక్ అఫెన్సస్ వింగ్‌ను ఆశ్రయించాడు గుజరాత్‌కు చెందిన ఓ అకౌంటెంట్. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన 32 ఏళ్ల మితేష్ పలు సంస్థల్లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. 2021లో స్టాక్ మార్కెట్‌లో తన పొదుపు డబ్బులను పెట్టుబడి పెట్టాలని చూస్తున్న సమయంలో మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన నరేష్ సేవక్‌రమణి సోషల్ మీడియా ద్వారా పరిచయమయ్యాడు. తొలుత షేర్లు కొనడం, అమ్మడం విషయంలో సహాయం చేస్తానని నరేష్ చెప్పాడు. అదనపు ఫీజులు అవసరం లేదని, ట్రేడింగ్ ద్వారా కమీషన్ కూడా సంపాదించవచ్చని సూచించాడు. తాను అప్పటికే స్టాక్ మార్కెట్ గురించి నేర్చుకుంటున్నానని చెప్పడంతో.. నరేష్ కొన్ని లింకులు పంపి ట్రేడింగ్ గురించి తెలుసుకునేలా చేసాడు.

2024లో భారీ పెట్టుబడులు

మూడేళ్ల పాటు మితేష్ వివిధ మొత్తాల్లో పెట్టుబడులు పెడుతూ ట్రేడింగ్ లో అనుభవం సంపాదించాడు. 2024లో మాత్రం పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం స్నేహితుల దగ్గర అప్పు చేశాడు. ఈ విషయాన్ని నరేష్‌తో చెప్పగా.. 'ఎవశ్రీశ్రీశీ ఎఱీుఎవం' అనే ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌ను పరిచయం చేసినట్లు మితేష్ ఆరోపించాడు. ఆ ప్లాట్‌ఫామ్‌లో ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న తనకు కమిషన్ చెల్లించాలని చెప్పడంతో నరేష్ పంపిన లింక్ ద్వారా మితేష్ ఎవశ్రీశ్రీశీ ఎఱీుఎవంలో ఖాతా తెరిచాడు.

బ్యాంక్ ఖాతాలు..ూ= కోట్లు.. వరుసగా డబ్బులు!

ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు వివిధ బ్యాంకు ఖాతాల వివరాలు, ూ= కోట్లు మితేష్ కు కనిపించాయి. దాంతో ఎవశ్రీశ్రీశీ ఎఱీుఎవం తో పాటు ూఅఎఽస్ట్రఅ ఎఅఱీుఎఱీుఎ జుఱ్‌వతీజూతీఅంవ, ్రుఎఱీుఅటఎ ×అటఱీు, ఱీుఖతీబ్‌అ వీశీఅవఎ, ణతీఅంస్ట్రీఅ తదితర పేర్లతో ఉన్న ఖాతాలకు డబ్బులు పంపాడు. తాను చేసిన ప్రతి లావాదేవీకి సంబంధించిన స్క్రీన్‌షాట్లను నరేష్‌కు వాట్సాప్ ద్వారా పంపించాడు. ఆ తర్వాత తాను పంపిన డబ్బుకు సమానమైన మొత్తం .. ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో తన ఖాతా బ్యాలెన్స్‌గా కనిపించేదని మితేష్ తెలిపాడు. అంతేకాదు.. నరేష్ సూచన ప్రకారం అతనికి, ఇతర ఖాతాలకు కమీషన్ మొత్తాలను బదిలీ చేసాడు.

రూ.6.35 కోట్లు పెట్టాడు.. రూ.4.23 కోట్లు తిరిగి వచ్చాయి

2024 నుంచి 2026 ఫిబ్రవరి వరకు మితేష్ మొత్తం రూ.6,35,47,843 పెట్టుబడి పెట్టాడు. అందులో రూ.4,23,15,169 తిరిగి తనకు వచ్చినట్లు తెలిపాడు. అంటే మిగిలిన మొత్తాన్ని తిరిగి పొందాల్సి ఉంది. అయితే అప్పటివరకు ప్లాట్‌ఫామ్‌లో కనిపించిన లాభాల లెక్కలు మితేష్‌కు మరింత నమ్మకాన్ని కలిగించాయి. 2026 ఫిబ్రవరి నాటికి తన పెట్టుబడికి అదనంగా దాదాపు రూ.2 కోట్ల లాభం ప్లాట్‌ఫామ్‌లో కనిపించింది. ఇక ఆ డబ్బును బ్యాంక్ ఖాతాలోకి తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. అక్కడే కథ ఒక్కసారిగా మలుపు తిరిగింది. మితేష్ ప్లాట్‌ఫామ్‌లో విత్‌డ్రా ఆప్షన్ ఎంచుకున్నాడు. కానీ.. డబ్బులు రావాల్సింది పోయి.. స్క్రీన్‌పై ఎర్రర్ మెసేజ్ కనిపించింది! తన డబ్బును బ్యాంక్ ఖాతాలోకి బదిలీ చేసుకోలేకపోయినట్లు మితేష్ తెలిపాడు. విత్‌డ్రా ఎందుకు కావడం లేదని మితేష్ నరేష్‌ను సంప్రదించాడు. ఒకటి రెండు రోజుల్లో విత్‌డ్రా ఏర్పాటు చేస్తానని నరేష్ చెప్పినప్పటికీ రోజులు గడిచినా డబ్బు మాత్రం రాలేదు. ఆ తర్వాత నరేష్ ఫోన్ కాల్స్‌కు స్పందించడం కూడా ఆపేశాడని మితేష్ ఆరోపించాడు. అప్పుడే తనకు అనుమానం వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

మొత్తం నష్టం రూ.4.12 కోట్లు?

మితేష్ ఫిర్యాదు ప్రకారం.. తన పెట్టుబడిలో ఇంకా రూ.2.12 కోట్ల అసలు మొత్తం రావాల్సి ఉంది. దీనికి అదనంగా ప్లాట్‌ఫామ్‌లో చూపించిన సుమారు రూ.2 కోట్ల లాభం కూడా అందలేదు. ఈ రెండింటినీ కలిపితే తనకు రావాల్సిన మొత్తం రూ.4,12,33,655. అంటే.. కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టి, కొంత మొత్తం తిరిగి పొందినప్పటికీ, చివరికి రూ.4.12 కోట్ల మేర నష్టం జరిగింది. దీంతో మితేష్ రాజ్‌కోట్ కు చెందిన ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్ ను ఆశ్రయించాడు. నరేష్ సేవక్‌రమణితో పాటు డబ్బులు జమ చేసినట్లు చెప్పిన బ్యాంకు ఖాతాల హోల్డర్ల పేర్లను కూడా ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫిర్యాదు ఆధారంగా జూఐ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. డబ్బులు ఎక్కడికి వెళ్లాయి? ప్రస్తుతం దర్యాప్తులో కీలకంగా మారిన ప్రశ్న ఇదే. మితేష్ పంపిన డబ్బులు ఏ బ్యాంకు ఖాతాల్లోకి వెళ్లాయి? ఆ ఖాతాలను ఎవరు నిర్వహిస్తున్నారు? ఎవశ్రీశ్రీశీ ఎఱీుఎవం ప్లాట్‌ఫామ్ వెనుక ఎవరున్నారు? దర్యాప్తులో కోట్ల రూపాయల లావాదేవీల స్కామ్ వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

చక్కెర ఉత్పత్తిలో భారత్‌ది రెండో
స్థానం అగ్ర స్థానం ఏ దేశానిదో తెలుసా..?



ప్రపంచ చక్కెర ఉత్పత్తిలో భారత్ రెండో స్థానంలో కొనసాగుతోంది. చెరకు సాగులో భారత్‌కు ఉన్న విస్తారమైన వనరులు, చక్కెర పరిశ్రమ కారణంగా ప్రపంచ మార్కెట్‌లో దేశానికి కీలక స్థానం ఉంది. అయితే ప్రపంచంలో అత్యధికంగా చక్కెర ఉత్పత్తి చేసే దేశం ఏది? భారత్, చైనా, పాకిస్తాన్, అమెరికా వంటి దేశాలు ఏ స్థానాల్లో ఉన్నాయో తెలుసుకుందాం. రోజువారీ జీవితంలో చక్కెరను ఎక్కువగా వినియోగిస్తారు. ముఖ్యంగా పండుగలు, ఆహార పరిశ్రమ, పానీయాల తయారీ వంటి రంగాల్లో చక్కెర వినియోగం ఎక్కువగా ఉంటుంది. పండుగ సీజన్ నేపథ్యంలో డిమాండ్ పెరగడంతో చక్కెర ధరలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. ఇప్పుడు దేశంలో చెక్కెర కేజీ రూ.70కి చేరుకుంది. చక్కర ధర నేరుగా సామాన్యుడి జోబుపై ప్రభావం చూపుతుంది. చక్కర ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం ప్రపంచంలో అత్యధికంగా చక్కెరను ఉత్పత్తి(ఔశీతీశ్రీస రాబస్ట్రుతీ్రతీశీంబఖ్‌అశీఅ) చేస్తున్న దేశం ఏది? భారత్ ఏ స్థానంలో ఉంది? పాకిస్తాన్ పరిస్థితి ఎలా ఉంది? అనే విషయాలు ఆసక్తికరంగా మారాయి.

అగ్రస్థానంలో బ్రెజిల్.. రెండో స్థానంలో భారత్

ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే చెక్కరలో సుమారు 80 శాతం చెరకు నుండి, మిగిలిన 20 శాతం చక్కెర దుంప (రాబస్ట్రుతీ దీవవ్) నుంచి వస్తుంది. బ్రెజిల్, భారత్ వంటి దేశాల్లో చెరకు ఆధారిత చక్కెర పరిశ్రమకు పెద్ద ప్రాధాన్యం ఉంది. చక్కెర ఉత్పత్తిలో బ్రెజిల్ ప్రపంచంలోనే మొదటి స్థానం (అందుబాటులో ఉన్న 2024-25 గణాంకాల మేరకు)లో కొనసాగుతోంది. ప్రపంచ చక్కెర ఉత్పత్తిలో బ్రెజిల్ వాటా సుమారు 22-24 శాతంగా ఉందని భారత వినియోగదారుల వ్యవహారాల శాఖ నివేదిక పేర్కొంది. సుమారు 16 శాతం వాటాతో భారత్ రెండో స్థానంలో ఉంది. ప్రధానంగా చక్కెర దుంపల నుండి చక్కెరను ఉత్పత్తి చేసే యూరోపియన్ యూనియన్ మూడో స్థానంలో ఉంది. చైనా, థాయ్‌లాండ్, అమెరికా తదుపరి మూడు స్థానాల్లో ఉన్నాయి.

టాప్-10 దేశాలు ఇవే..

ప్రపంచ చక్కెర ఉత్పత్తిలో బ్రెజిల్ 44.39 మిలియన్ టన్నులతో మొదటి స్థానంలో ఉంది. భారత్ 35.25 మిలియన్ టన్నులతో రెండో స్థానంలో ఉంది. యూరోపియన్ యూనియన్ 15.49 మిలియన్ టన్నులతో మూడో స్థానంలో ఉండగా, చైనా 11.50 మిలియన్ టన్నులతో నాలుగో స్థానంలో ఉంది. థాయ్‌లాండ్ 10.25 మిలియన్ టన్నులతో ఐదో స్థానంలో, అమెరికా 8.48 మిలియన్ టన్నులతో ఆరో స్థానంలో ఉంది. రష్యా 6.50 మిలియన్ టన్నులతో ఏడో స్థానంలో ఉండగా, పాకిస్తాన్ 6.21 మిలియన్ టన్నులతో ఎనిమిదో స్థానంలో ఉంది. మెక్సికో 5.40 మిలియన్ టన్నులతో తొమ్మిదో స్థానంలో, ఆస్ట్రేలియా 4 మిలియన్ టన్నులతో పదో స్థానంలో ఉన్నాయి. భారత్‌లో అనేక రాష్ట్రాల్లో చెరకు సాగు విస్తృతంగా జరుగుతోంది. దీంతో దేశం ప్రపంచ చక్కెర మార్కెట్‌లో కీలక పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర దేశంలోని ప్రధాన చెరకు ఉత్పత్తి రాష్ట్రాలుగా ఉన్నాయి. 2025-26లో దేశ చెరకు ఉత్పత్తి 500 మిలియన్ టన్నులకు చేరినట్లు కేంద్ర ప్రభుత్వ తాజా సమాచారం వెల్లడించింది.

పాకిస్థాన్ స్థానమిదే..?

పాకిస్థాన్ చక్కెర ఉత్పత్తిలో భారత్ కంటే చాలా వెనుకబడి ఉంది. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ఆ దేశ చక్కెర ఉత్పత్తి సుమారు 6.21 మిలియన్ టన్నులుగా అంచనా వేయబడింది. ప్రపంచ చక్కెర ఉత్పత్తిలో పాకిస్థాన్ వాటా సుమారు 3-4 శాతంగా ఉంది. మొత్తంగా చూస్తే, చక్కెర ఉత్పత్తిలో బ్రెజిల్ ఆధిపత్యం కొనసాగుతుండగా, భారత్ రెండో స్థానంలో నిలుస్తోంది. పాకిస్థాన్ మాత్రం టాప్-10లో ఎనిమిదో స్థానంలో ఉంది

డేట్ ఆఫ్ బర్త్, డెట్ సర్టిఫికేట్లు పొందాలంటే కష్టమే
కేంద్రం కఠిన రూల్స్ అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చేశాయి



డేట్ ఆఫ్ బర్త్, డెత్ సర్టిఫికేట్ల జారీకి కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఇక నుంచి వీటి జారీ ప్రక్రియ కఠినతరంగా ఉంటుంది. ఇప్పటివరకు ఈ సర్టిఫికేట్లను సులువుగా పొందే అవకాశం ఉండేది. కానీ ఇక నుంచి ఆలస్యం కానుంది. కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జనన మరణాల సవరణ చట్టంను అక్టోబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. జనన మరణాల నమోదు చట్టం 1969కు కొన్ని సవరణలు కేంద్రం చేసింది. ఇందులో భాగంగా డేట్ ఆఫ్ బర్త్, డెత్ సర్టిఫికేట్ల జారీకి కొత్త రూల్స్ తీసుకురాగా.. గతంతో పోలిస్తే ఇవి మరింత కఠినంగా ఉన్నాయి. ప్రజలు సకాలంలో జనన, మరణాలు నమోదు చేసుకునేలా, జాప్యాన్ని నివారించడం లక్ష్యంగా కఠిన ఆంక్షలు విధించారు. జనన మరణాల నమోదు సవరణ బిల్లు ఈ ఏడాది ఆగస్టులో జరిగిన వర్షాకాల సమావేశాల్లో ఆమోదం పొందగా.. రాష్ట్రపతి ఆమోదంతో అక్టోబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. జనన, మరణ ధృవపత్రాల జారీలో పారదర్శకత కోసం ఈ కొత్త రూల్స్ తీసుకొచ్చారు. నేటి నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త రూల్స్ ఏంటో చూద్దాం.

కొత్త రూల్స్ ఇవే..

జననం లేదా మరణం జరిగిన 21 రోజుల్లోపు నమోదు చేసుకుంటే ప్రక్రియ సులభతరంగా ఉంటుంది. ఎలాంటి రుసుంలు చెల్లించకుండానే ఉచితంగా జారీ చేస్తారు. ఒకవేళ 21 రోజుల తర్వాత దరఖాస్తు చేసుకుంటే ప్రక్రియ మరింత కఠినతరంగా ఉంటుంది. ఒక ఏడాది నుంచి రెండేళ్లలోపు దరఖాస్తు చేసుకుంటే సర్టిఫికేట్ల జారీ ప్రక్రియ క్లిష్టతరంగా ఉంటుంది. జిల్లా మేజిస్ట్రేట్, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఆదేశాలు అవసరం పడతాయి. ఇక రెండేళ్లు దాటాక అప్లై చేసుకుంటే ఫస్ట్ క్లాస్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ఆదేశాలు అవసరమవుతాయి. వారి ఆదేశాలు ఇచ్చిన తర్వాతనే సర్టిఫికేట్లు జారీ అవుతాయి. ఈ కొత్త మార్గదర్శకాలను అమలు చేసే బాధ్యతలను రిజిస్ట్రార్లకు అప్పగించారు. దేశవ్యాప్తంగా అన్ని గ్రామ, నగర పంచాయతీలతో పాటు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఈ ఆదేశాలు అమలవుతాయని కేంద్రం స్పష్టం చేసింది.

వేరే జిల్లాలో మరణిస్తే..

అలా చేస్తే పంచదార నీళ్లైనా ప్రమాదమే! పసికందు ఆరోగ్యానికి పాటించాల్సిన నియమాలు ఇవి!

'న్యూ బార్న్ బేబీ కేర్ గైడ్' మొదటి ఆరు నెలలు ముఖ్యం

శిశువుల సంరక్షణలో ఏం చేయాలి? ఏం చేయకూడదంటే?



ఆంధ్రప్రదేశ్?లోని విజయనగరం జిల్లా బాదంగిలో ఆరోగ్యంగా పుట్టిన శిశువు ఏడుస్తున్నాడని ఇటీవల కుటుంబ సభ్యులు పటిక పంచదార నీరు తాగించారు. నీరు పట్టే విధానం సక్రమంగా లేకపోవడంతో, ఆ నీరు శిశువు ఊపిరితిత్తుల్లోకి చేరి, ఆ పసికందు ప్రాణాలు కోల్పోయాడు. ఈ క్రమంలో శిశు సంరక్షణపై అవగాహన లేక ఆయుష్షు ఆదిలోనే తీరిపోయింది. చిన్నారుల విషయంలో ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా, వారి ఆరోగ్యం ప్రమాదంలో పడుతుంది. నవజాత శిశు సంరక్షణలో జాగ్రత్తగా ఉండటం చాలా ముఖ్యం. అయితే, శిశువు జన్మించిన తర్వాత మొదటి ఆరు నెలల కాలంలో చిన్నారుల సంరక్షణలో తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలు ఏం చేయాలి? ఏం చేయకూడదో? లాంటి అంశాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

పాలు ఎలా పట్టాలి? :

మొదటి ఆరునెలల పాటు శిశువుకు కచ్చితంగా తల్లిపాలను మాత్రమే ఇవ్వాలి. అయితే, గంట గంటకూ అక్కర్లేదు. చిన్నారులు ఏడ్చినప్పుడు లేదా ప్రతి 2-3 గంటలకు ఒకసారి పాలు పడితే చాలు. ఒకవేళ తల్లిపాలు లేకపోతే, డాక్టర్ సలహా మేరకు ఫార్ములా ఫీడ్ అంటే పాలపొడి వంటివి ఇవ్వాలి. అంతేకానీ, ప్యాకెట్ పాలు లేదా చక్కెర నీళ్లు వంటివి అసలు ఇవ్వకూడదు. ఒకవేళ బాటిల్ ఫీడింగ్ ఇవ్వాల్సి వస్తే 100 శాతం ఫ్లాట్?గా పడుకోబెట్టి ఇవ్వాలి. అలాగే, బాటిల్?ను శుభ్రంగా కడిగి వాడుకోవాలంటున్నారు నిపుణులు. తల్లి పడుకుని బిడ్డకు పాలు పట్టడం అత్యంత ప్రమాదకరమంటున్నారు నిపుణులు. ఇలా చేస్తే అవి ముక్కు లేదా ఊపిరితిత్తుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అందువల్ల ఎప్పుడూ కూర్చునే ఇవ్వాలట. పాలు ఇచ్చేటప్పుడు శిశువు తల భాగం 45 డిగ్రీల కోణంలో (కొద్దిగా పైకి) ఉండేలా చూసుకోవాలి. ఈ క్రమంలో తల్లి రొమ్ముపై ఉండే నల్లటి భాగం శిశువు నోటికి పూర్తిగా అందేలా పడితే పాలు బాగా వస్తాయి.

గది వాతావరణం, దుస్తులు :

శిశువు ఉండే గదిలో ఫ్యాన్? లేదా ూజ వాడుకోవచ్చు. కానీ, ూజ ఉష్ణోగ్రతను 26 డిగ్రీల కంటే తక్కువగా అసలు తగ్గించకూడదని నిపుణులు చెబుతున్నారు. అలాగే, గది ఉష్ణోగ్రత మరీ చల్లగా లేదా వేడిగా ఉంచొద్దట. ఎప్పుడూ 25-26 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉండేలా చూసుకోవాలి. అంతేకాదు, గదిలో గాలి, వెలుతురు బాగా ప్రసరించేలా చూసుకోవాలి. చిన్నారులకు దుస్తులను గట్టిగా బిగించి చుట్టకూడదు.

డాక్టర్?ని ఎప్పుడు సంప్రదించాలి? :

మాములుగా శిశువు 15-20 నిమిషాలు పాలు తాగితే సరిపోతుంది. అలాకాకుండా, శిశువు సరిగ్గా పాలు తాగకపోవడం, సగం కంటే తక్కువ తాగడం మనం ఎంత బుజ్జగించినా, శిశువు గుక్కపట్టి ఏడవడం జ్వరం రావడం శరీరం, పెదవులు, నీలం రంగులోకి మారడం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది. పాలు తాగినా ప్రతిసారి పెద్ద మొత్తంలో వాంతులు చేసుకోవడం, కడుపు ఉబ్బిపోవడం కడుపుపై చేయివేస్తే విపరీతంగా ఏడవడం బొడ్డు నుంచి చీము కారడం లేదా రక్తం రావడం శిశువు బరువు 2.5 కిలోల దాటిన తర్వాత రోజూ స్నానం చేయించొచ్చు. చిన్న ప్లాస్టిక్ టబ్?లో కూర్చోబెట్టి చేయించడం మంచిది. సంప్రదాయ పద్ధతి ప్రకారం, కాళ్లపై పడుకోబెట్టి స్నానం చేయించడం వల్ల ముక్కు, నోరు, చెవుల్లోకి నీరు వెళ్లే ప్రమాదముంది. 2.5 కిలోల కంటే తక్కువ బరువుతో పుట్టిన పిల్లలను తల్లి తన గుండెలకు హత్తుకుని ఉంచాలి. ఇది శిశువుకు వెచ్చదనాన్ని ఇస్తుంది. ఇది తల్లిబిడ్డల మధ్య బంధాన్ని పెంచడమే కాకుండా, తల్లిలో పాల ఉత్పత్తిని పెంచడానికి దోహదపడుతుంది. - డాక్టర్? పి. రవీందర్ రెడ్డి, సీనియర్ పిడియాట్రిషియన్

శుభ్రత, సంప్రదాయ పద్ధతులు :

శిశువును తాకే ముందే ఇంట్లో ప్రతి ఒక్కరూ చేతులను శుభ్రం చేసుకోవాలి లేదా శానిటైజర్ వాడాలి. పసికందు ముక్కు, చెవులు, ప్రైవేట్ భాగాల్లో నూనెలు పోయడం లాంటివి అసలు చేయకూడదు. కాటుక చిన్నారి శరీరం మీద ఎక్కడైనా పెట్టొచ్చు. కానీ కళ్లలో వద్దు. బొడ్డు ఊడిపోయే వరకు దాన్ని పొడిగా ఉంచాలి. దానిపై ఆయిల్స్, లోషన్స్ లేదా పౌడర్లు రాయకూడదు. సాంబ్రాణి పొగ వంటివి వేయవద్దు. పొగ ఊపిరితిత్తుల్లోకి వెళ్లి శిశువు ఉక్కిరిబిక్కిరి అయ్యే అవకాశం ఉంటుంది.

ఇలా పడుకోబెట్టండి :

వీలైతే శిశువు కోసం ప్రత్యేకంగా ఉండే ఊయల లేదా చిన్న బేబీకాట్ ఉపయోగించడం మంచిది. ఒకవేళ మంచంపై తల్లి పక్కన పడుకోబెట్టుకున్నా, శిశువును గోడ వైపుగా ఉంచితే మేలు ఇంట్లో ఎవరికైనా జలుబు, దగ్గు, వాంతులు, విరేచనాలు వంటివి ఉంటే, అలాంటి వారు శిశువుకు దూరంగా ఉండాలి. బేబీ ఫేస్?పై ఎవరూ ముద్దులు పెట్టొద్దు. పెంపుడు జంతువుల్ని శిశువు ఉండే గదిలోకి రానివ్వకూడదు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

ఒత్తిడి వల్ల శరీరం విశ్రాంతి కోల్పోతుందా? నాడీ వ్యవస్థను ప్రశాంతపరిచే మార్గాలు ఇవేనట!

నాడులను శాంత పరచుకోవడానికి మార్గాలున్నాయట

వాటిని ట్రై చేస్తే మేలు జరుగుతుందని నిపుణుల సూచన!



ఒత్తిడి తీవ్రమైతే నాడీ వ్యవస్థ అతిగా స్పందిస్తుంది. దీంతో మనసు ఉద్రిక్తంగా మారుతుంది. శరీరం విశ్రాంతిని కోల్పోతుంది. ఈ క్రమంలో నాడుల స్పందనను నెమ్మదింపజేయడానికి ఎన్నో పరిష్కారాలు ఉన్నాయంటున్నారు నిపుణులు.

ఆలోచనల నుంచి వర్తమానంలోకి :

ఒత్తిడి, ఆందోళన తరచూ శరీరంలో మొదలవుతుంది కానీ, మనసులో కాదు. ఇది నాడీ వ్యవస్థను శాంతపరచడం ద్వారా జరుగుతుంది. కాబట్టి, మన ఆలోచనల్ని దానిపై మళ్లించడం, శ్వాసను గమనించాలి. అలాగే, నేలపై మన పాదాలను అనుభూతి చెందడం, చుట్టూ ఉన్న పరిసరాలపై శ్రద్ధ పెట్టాలి. ఇది మిమ్మల్ని ఆలోచనల నుంచి బయటకు తీసుకువచ్చి, వర్తమానంలోకి తీసుకురావడానికి సహాయపడుతాయని నిపుణులు చెబుతున్నారు. తద్వారా, ఒత్తిడి తగ్గుతుందంటున్నారు.

మానసిక స్థితిని అర్థం చేసుకోవడం :

నాడీ వ్యవస్థ ఎప్పుడు ఉత్తేజితమవుతుందో మొట్టమొదట గుర్తించాలి. 'ఇప్పుడు నా శరీరంలో ఏం జరుగుతోంది? నేను కోపంగా, అశాంతితో లేదా ఆందోళనగా ఉన్నానా? అని మనల్ని మనం ఆత్మావలోకనం చేసుకోవాలి. ఇలా చేస్తే ప్రతిచర్య, ప్రతిస్పందన మధ్య ఓ విరామాన్ని సృష్టించి ఒత్తిడిని దూరం చేస్తుందంటున్నారు నిపుణులు

వేగాన్ని తగ్గించుకోవడం :

ఒత్తిడి, ఆందోళన అత్యవసరాన్ని సృష్టిస్తాయి. ప్రతి పని ముఖ్యమైనదిగా అనిపిస్తుందట. మన నాడీ వ్యవస్థ వేగానికి ప్రతిస్పందిస్తుంది. కాబట్టి, కదలికలు, మాటలు, శ్వాసను నెమ్మదిగా చేయడం ద్వారా మనం సురక్షితంగా ఉన్నామని శరీరానికి సంకేతం పంపొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. మనం తరచూ ఒత్తిడి, ఆందోళనకు గురైనట్లు లేదా విశ్రాంతి లేనట్లుగా కనిపిస్తే, ఈ స్థితిలో ఎక్కువ సేపు గడిపామని దానర్థం. ఇలాంటప్పుడు ఒత్తిడి, ఆందోళన ఎక్కడ మొదలైందో ఆలోచించాలి. నాడీవ్యవస్థ స్తంభించడానికి కారణాలను తెలుసుకోవాలి. నాడీవ్యవస్థను నియంత్రించుకోవాలి. అంటే, మన శరీరం ప్రశాంతంగా ఉండటానికి తగినంత సురక్షితంగా భావించేలా సహాయపడాలి. - ఒవెన్ ఓ కెన్, బ్రిటన్?కు చెందిన సుప్రసిద్ధ మనోవైద్య నిపుణుడు

అంతర్గత సంఘర్షణకు చెక్ :

ఒత్తిడి భావనను ప్రతిఘటించడానికి బదులుగా దాన్ని అనుమతించాలట. మన భావాలతో పోరాడినప్పుడు మరో పొర ఉద్రిక్తతను జోడించినట్లు లెక్క. ఆందోళనకు అడ్డుపడకుండా ఉండే అది అంతర్గత సంఘర్షణను తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు. నాడీ వ్యవస్థ కుదుటపడటానికి సహాయపడుతుందని అంటున్నారు.

బ్రేక్ తీసుకోవడం :

ఒత్తిడి వలయంను ముందుగానే నిలువరించాలట. మనం తీసుకునే చిన్న బ్రేక్ కూడా ఈ వలయం తీవ్రం కాకుండా ఆపగలదు. ఈ క్రమంలో ఒత్తిడి సంకేతాలను ఎంత ముందుగా గమనిస్తే, స్పందన అంత సులవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

రోజువారీ అలవాట్లలో మార్పులు :

రోజులో సురక్షితమైన క్షణాలను సృష్టించుకోండి. మన నాడీవ్యవస్థ నిరంతరం సంకేతాల కోసం వెతుకుతూ ఉంటుంది. ఏ విధమైన ఆటంకాలు లేకుండా కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా కూర్చోవడం, కొద్దిసేపు నడవడం, నిరంతర సమాచార ప్రసారానికి దూరంగా ఉండటం క్రమం తప్పకుండా చేసినప్పుడు, చిన్న విరామాలు కూడా ఆందోళన నుంచి ఉపశమనానికి తోడ్పడతాయని నిపుణులు సలహా ఇస్తున్నారు. ఒత్తిడిలో ఓ సాధారణ ధోరణ ఏమిటంటే, మనం అనుకున్న రీతిలో దాన్ని పరిష్కరించాలనుకోవడం. కానీ ఇది తరచుగా మరింత ఒత్తిడిని సృష్టించగలదని నిపుణులు చెబుతున్నారు. ఆందోళన అనేది మానవ సహజమని, దాన్ని పూర్తిగా తొలగించాల్సిన అవసరం లేదంటున్నారు నిపుణులు.

శరీరం సహజ ప్రతిస్పందన :

ముప్పును పసిగట్టినపుడు శరీరం సహజంగానే పోరాటమైనా చేస్తుంది లేదా పలాయన మార్గాన్ని ఎంచుకుంటుంది. ఆ సమయంలో వేగవంతమైన శ్వాస, కండరాలు బిగువుగా మారడం, గుండె వేగంగా కొట్టుకోవడం, అప్రమత్తం కావడం లాంటివి ఉండొచ్చంటున్నారు నిపుణులు. ఇవన్నీ మనల్ని మనం రక్షించుకోవడానికి ఉద్దేశించినవట. కానీ, మన నాడీ వ్యవస్థ వాస్తవ ప్రమాదానికి, ఆందోళనకరమైన ఆలోచనలకు మధ్య తేడాను ఎల్లపుడూ గుర్తించదు. కాబట్టి, రోజువారీ ఒత్తిడి కూడా పోరాటం లేదా పలాయనం ప్రతిస్పందనను ప్రేరేపించొచ్చట. మనం పోరాటం లేదా పలాయన స్థితిలో చిక్కుకుపోయినట్లు భావిస్తే, దాని నుంచి బలవంతంగా బయటకు రావడం లక్ష్యం కాకూడదని నిపుణులు చెబుతున్నారు. దానికి బదులుగా, శరీరానికి సున్నితంగా భద్రతా సంకేతాలు ఇవ్వడంపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు.


పరిశోధన మూలాలు :

ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

కడుపుబ్బరంగా అనిపిస్తోందా సహజసిద్ధ పరిష్కారాలు ఇవేనట!

జీర్ణ సమస్యల నియంత్రణకు ఇవి ట్రై చేస్తే బెటర్

అంటున్న నిపుణులు



ఇష్టమైన ఆహారం ఎక్కువగా తిన్నా, మలబద్ధకం ఉన్నా, కడుపులో గ్యాస్ ఏర్పడినా, నీళ్లు ఎక్కువగా తాగినా.. ఇలా పలు సందర్భాల్లో కడుపు ఉబ్బరంగా అనిపించడం మామూలే! దీంతో తలెత్తే అసౌకర్యం వల్ల ఇతర పనులపై దృష్టి పెట్టలేం. అయితే, ఈ సమస్యను తగ్గించుకోవాలంటే కొన్ని చిన్నచిన్న చిట్కాలు పాటించాలంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

ఫైబర్ ఎక్కువగా తీసుకోవాలి :

ఫైబర్, ద్రవాహారం తక్కువగా తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం వంటివి మలబద్ధకానికి దారితీస్తాయంటున్నారు నిపుణులు. ఈ సమస్య వల్ల కడుపుబ్బరం రావచ్చని చెబుతున్నారు. అందుకే, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాల్ని రోజూ తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. అలాగే, తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పప్పులు, నట్స్, గింజల్లో లాంటి వాటిల్లో ఫైబర్ అధికంగా ఉంటుందని సలహా ఇస్తున్నారు. వీటితోపాటు ద్రవాహారం ఎక్కువగా తీసుకోవాలని పేర్కొంటున్నారు. అలాగే, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని తెలియజేస్తున్నారు.

గబగబా తినేస్తున్నారా? :

సమయం లేదనో, ఇతర కారణాల వల్ల కొంతమంది గబగబా భోజనం చేసేస్తుంటారు. కడుపులో గ్యాస్, ఉబ్బరానికి ఇది కూడా ఓ కారణమంటున్నారు నిపుణులు. ఎందుకంటే, ఇలా గబగబా తినడం వల్ల ఆహారంతోపాటు గాలి కూడా కడుపులోకి వెళ్లిపోతుందట. దీనివల్ల కడుపుబ్బరం వస్తుందని చెబుతున్నారు. అందుకే, భోజనానికి కనీసం అరగంటైనా కేటాయించాలని సూచిస్తున్నారు. అలాగే, ఆహారాన్ని నెమ్మదిగా నమిలి తినాలని సలహా ఇస్తున్నారు. ఈ క్రమంలో ఆహార పదార్థాల రుచిని ఆస్వాదించడంతో పాటు జీర్ణ వ్యవస్థ కూడా చురుగ్గా ఉంటుందని తెలియజేస్తున్నారు. అలాగే, ఎక్కువ ఆహారం తీసుకోకుండా జాగ్రత్తపడచ్చని పేర్కొంటున్నారు. వేగంగా తినడం వల్ల గాలిని మింగడం జరిగి, కడుపు ఉబ్బరం, గ్యాస్, అసౌకర్యానికి దారితీస్తుందని పేర్కొంది.

వీటితో ఉపశమనం :

పెరుగు లేదా మజ్జిగ : కడుపులోని మంచి బ్యాక్టీరియా ఉబ్బరాన్ని తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇందుకోసం ప్రొబయోటిక్స్ ఎక్కువగా ఉండే పెరుగు, మజ్జిగా వంటివి రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలంటున్నారు.

అల్లం టీ :

అల్లం కడుపులో యాసిడ్ స్థాయిని క్రమబద్ధీకరించడం ద్వారా అజీర్ణం, అసిడిటీ నుంచి ఉపశమనం కలిగిస్తుందంటున్నారు నిపుణులు. అంతేకాదు, గ్యాస్ట్రిక్ సమస్యలు, కడుపుబ్బరం వంటి సమస్యలను తగ్గించడానికి ఇది ఒక సహజ నివారణగా పనిచేస్తుందని చెబుతున్నారు. అల్లం ఎగువ జీర్ణశయాంతర లక్షణాలను మెరుగుపరుస్తుందని అధ్యయనం పేర్కొంది.

పుదీనా టీ :

పుదీనాలో ఉండే మెంథాల్ జీర్ణవ్యవస్థ కండరాలను రిలాక్స్ చేయడంతో పాటు గ్యాస్?ను తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇందులోని ముఖ్యమైన నూనెలు కడుపు ఉబ్బరం, ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ లక్షణాలని తగ్గిస్తాయని అంటున్నారు. స్వల్పకాలిక జీర్ణక్రియ సమస్యల నుంచి ఉపశమనం పొందడానికి పెప్పర్‌మింట్ టీ విస్తృతంగా ఉపయోగిస్తారని పేర్కొంది.

ప్రశాంతంగా నిద్రపోవడం :

రాత్రుళ్లు ఆలస్యంగా తినడం, అర్ధరాత్రి దాటాక పడుకోవడం వల్ల నిద్ర సరిపోదంటున్నారు నిపుణులు. తద్వారా తీసుకున్న ఆరక్కపోవడం, గ్యాస్, కడుపుబ్బరం వంటి సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. అందుకే త్వరగా తినడం, వేళకు పడుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది

మీకు కోపం ఎక్కువగా వస్తుందా?

నిపుణులు చెప్తున్న టిప్స్ ఇవే!

మనిషికి కోపం రావడానికి కారణాలనేకం దీన్ని ఎలా అదుపులో ఉంచుకోవాలో తెలుసా?



ఎదుటి వ్యక్తి ప్రవర్తన నచ్చకపోయినా, చెప్పిన పని చేయకపోయినా, మనతో దురుసుగా మాట్లాడినా, అవమానించినా, మన లక్ష్య సాధనలో విఫలమైనా కోపం రావొచ్చు. మనిషికి ఉండే ఏడు సార్వత్రిక భావోద్వేగాల్లో కోపం ఒకటని నిపుణులు చెబుతున్నారు. కోపం అనేది సమస్య కాదని, దాన్ని ఎలా నియంత్రిస్తాం, వ్యక్తపరుస్తాం అనే దానిలోనే అసలు సమస్య ఉందని చెబుతున్నారు. ఈ క్రమంలో కోపాన్ని ఎలా అదుపులో ఉంచుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం!

అలా ఎందుకు జరుగుతుంది? :

ఎవరి నుంచైనా ముప్పు పొంచి ఉందని తెలిసిన వెంటనే మనలోని ప్రమాద హెచ్చరిక వ్యవస్థ క్రియాశీలమవుతుందంటున్నారు నిపుణులు. అప్పుడు మన దృష్టి మొత్తం ఆ ముప్పుపై కేంద్రీకృతమవుతుందని చెబుతున్నారు. ప్రాణ రక్షణ స్థితిలో మన దేహం తీవ్రమైన కోపం, హింసాభావంతో నిండిపోతుందని పేర్కొంటున్నారు. మాములుగా ఆవేశం మన కడుపులో మొదలై, ముఖంపైకి వచ్చి, మనల్ని వికృతంగా ముఖం పెట్టేలా, పిడికిలి బిగించేలా చేస్తుందని పేర్కొంటున్నారు. అరుపు రూపంలో శరీరం నుంచి బయటికి వస్తుందని చెబుతున్నారు

విపరిణామాలు తప్పవు :

స్వల్పకాలంలో కోపం శక్తివంతమైనదిగా, ప్రతిఫలదాయకంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీని ద్వారా తాను కోరుకున్నది పొందుతానని భావించడం కొందరి క్షణికావేశానికి కారణమంటున్నారు. దీని విపరిణామాల మొదటి లక్షణం సంబంధాలను దెబ్బతీస్తుందని హెచ్చరిస్తున్నారు. చాలా సందర్భాల్లో బంధువులు, మిత్రులు దూరమైపోతారని తెలియజేస్తున్నారు. అది మనల్ని ఒంటరిగా చేస్తుందట. చాలామంది గాయపడతామనే భయంతో, తమను తాము రక్షించుకోలేమేమోనన్న అనుమానంతో, లేదా అన్యాయం జరుగుతుందేమోనన్న భయంతో స్పందిస్తారని వివరిస్తున్నారు.

ఇదో రుగ్మత :

కోప రుగ్మతకు సృష్టమైన నిర్ధారణ లేదట. కానీ, మానసిక వైద్య నిర్ధారణ మాన్యువల్?లో దీనిని 'ఇంటర్మిటెంట్ ఎక్స్?ప్లోసివ్ డిజార్డర్' అని చేర్చారు. ఇది దూకుడు ప్రేరణలను నియంత్రించడంలో వైఫల్యాన్ని సూచిస్తుందంటున్నారు నిపుణులు. పునరావృత ప్రవర్తనా విస్ఫోటనాల ద్వారా వ్యక్తమవుతూ ఉంటుందని చెబుతున్నారు. ఇది కుంగుబాటు, ఆందోళన, పోస్ట్-ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ మాదకద్రవ్యాల వినియోగ రుగ్మతలు, మరెన్నో విభిన్న మానసిక ఆరోగ్య సమస్యలలో కనిపిస్తుందని పేర్కొంటున్నారు. అంతే కాకుండా కోపం అనేది నిద్రలేమి సమస్యకూ దారి తీస్తుందని ఎర్కొంది. ఈ క్రమంలో అనవసరంగా కోపం వచ్చే వాళ్లకు కరోనరీ హార్ట్ డిసీజ్ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. కోపానికి కారణమయ్యే అంశాలను అంటే పరిసరాలు, వ్యక్తులను గుర్తించి దూరంగా ఉండాలంటున్నారు. భావోద్వేగాలను నియంత్రించుకోడానికి మొట్టమొదటి సూత్రం మనల్ని మనం సంభాళించుకోవాలని తెలియజేస్తున్నారు. ఆ తర్వాత దాన్ని అధిగమించడానికి జ్ఞానం, బలం, ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ఉండాలని చెబుతున్నారు. శ్రమలేని, నెమ్మదైన యోగా లాంటి వ్యాయామాలు కండరాలను సడలించి, ప్రశాంతతను కలిగిస్తాయని పేర్కొంది. కోపాన్ని తగ్గించుకోవడానికి ఉపకరించే వ్యూహాన్ని ఎంచుకోవాలని సూచిస్తున్నారు. ఇందులో శ్వాసను నెమ్మదింపజేయడం, ఊహాత్మక చిత్రాలు చూడటం, మన ఆలోచనలను విశ్లేషించడం, కొంత సమయం తీసుకుని పరిసరాలను మార్చుకోవడం లేదా విశ్రాంతి నైపుణ్యాలను ఉపయోగించడం వంటివి ఉండొచ్చని వివరిస్తున్నారు. మనస్తత్వవేత్తలు కోపానికి పలు థెరపీలు సూచిస్తున్నారు. కాగ్నిటివ్- బి- హేవియర్ థెరపీ కంపాషన్- పోకస్డ్ థెరపీ వంటివి ఇందులో ఉన్నాయట. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

రక్తం, హిమోగ్లోబిన్ పెరగాలంటే ఏ పండ్లు తినాలో తెలుసా?

హిమోగ్లోబిన్ స్థాయిని సహజంగా పెంచే అద్భుతమైన పండ్లు!



మానవ శరీరంలో ప్రతీ భాగానికి ఆక్సిజన్? చేరవేసే కీలకమైన బాధ్యత రక్తంలోని హిమోగ్లోబిన్?దే. ప్రస్తుతం జీవనశైలి మార్పులు, ఆహారపు అలవాట్లు, పోషకాహార లోపం వల్ల చాలామందిలో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉంటుంది. దీనివల్ల రక్తహీనత, తీవ్రమైన అలసట వంటి సమస్యలు తలెత్తుతాయట. అయితే, శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయి పెరగాలంటే మందులు వేసుకోవాలని అనుకుంటారు. కానీ, మనకు ప్రకృతి ప్రసాదించిన కొన్ని పండ్లను తినడం వల్ల చాలా వేగంగా హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుకోవచ్చంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

దానిమ్మ :

రక్తాన్ని మెరుగుపరచే ఉత్తమమైన పండ్లలో దానిమ్మను ఒకటిగా పరిగణిస్తారు. ఇందులో ఐరన్, విటమన్ సి, ఫోలేట్, యాంటీ ఆక్సిడెంట్లు వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. దానిమ్మలోని విటమిన్ సి అనేది ఆహారంలోని ఐరన్?ను శరీరం త్వరగా గ్రహించుకోవడానికి అవసరమంటున్నారు. అలాగే ఫోలేట్ అనేది శరీరంలో ఎర్ర రక్తకణాల ఉత్పత్తిని పెంచి హిమోగ్లోబిన్ స్థాయిలను మెరుగుపరచడానికి సహాయపడతాయని పేర్కొంటున్నారు. దీనివల్ల రక్తహీనత నుంచి బయటపడవచ్చని సూచిస్తున్నారు. దానిమ్మను స్వల్ప కాలం పాటు తీసుకోవడం వల్ల ఎరిత్రోపోయిసిస్ పెరగవచ్చని పేర్కొంది.

ఆపిల్స్ :

'రోజుకు ఒక యాపిల్ తింటే డాక్టర్ దగ్గరకు వెళ్లాల్సిన అవసరం లేదు' అని అందరికీ తెలిసిందే. ఇందులో ఐరన్, విటమిన్ సి సమృద్ధిగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి హిమోగ్లోబిన్ ఉత్పత్తికి మద్ధతు ఇస్తాయంటున్నారు. వీటిలోని ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియకు కూడా మేలు చేస్తుందని తెలియజేస్తున్నారు.

అరటిపండ్లు :

అరటిపండ్లు రక్తహీనతను తగ్గించడంలో, రక్తాన్ని పెంచడంలో అద్భుతంగా సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఐరన్?తో పాటు ఎర్రరక్త కణాల ఉత్పత్తికి అవసరమైన విటమిన్లు బి6, సి, ఫోలిక్ యాసిడ్ పుష్కలంగా ఉంటాయంటున్నారు. అరటిపండులోని ఐరన్ కంటెండ్ శరీరంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచడానికి ప్రేరేస్తుందని తెలియజేస్తున్నారు. ఇందులో విటమిన్ డీ6 అనేది శరీరంలో కొత్త ఎర్ర రక్తకణాలు, యాంటీబాడీల తయారీలో కీలక పాత్ర పోషిస్తుందని వివరిస్తున్నారు. ఫోలేట్ యాసిడ్ రక్తహీనత రాకుండా నిరోధిస్తుందని పేర్కొంటున్నారు.

నారింజ :

ఇందులో ఎక్కువగా ఐరన్ కంటెంట్ ఉండకపోవచ్చు. కానీ, వీటిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల శరీరం ఐరన్?ను మరింత సమర్థవంతంగా గ్రహిస్తుందని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో నారింజ పండ్లను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల ఐరన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాల ప్రయోజనాలు మరింత పెరుగుతాయంటున్నారు. నారింజ లేదా ఆపిల్ రసం ఐరన్?ను బాగా గ్రహిస్తాయని పేర్కొంది.

పుచ్చకాయ :

ఇందులో విటమిన్ సితో పాటు ఐరన్ కూడా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇది రక్త ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుందని అంటున్నారు. ఇది శరీరాన్ని హైడ్రేడెడ్?గా ఉంచడంతో పాటు మొత్తం రక్త ప్రసరణకు తోడ్పడుతుందని తెలియజేస్తున్నారు.

ఖర్జూరాలు :

ఇందులో సహజంగానే ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచడానికి, ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని వేగవంతం చేయడానికి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు. ఖర్జూరాలలోని గ్లూకోజ్, ఫ్రక్టోజ్ వంటి సహజ చక్కెరలు తక్షణ శక్తిని అందిస్తాయని అంటున్నారు. ఖర్జూరపు సారం గుండె ద్వారా ఎరిథ్రోపోయిటిన్ సంశ్లేషణను పెంచడానికి, తద్వారా ఎముక మజ్జను ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి/హెమోపోయిసిస్‌కు

మాస్ సినిమాల్లో.. ఇది మరీ ఓవర్?



సినిమా చూస్తున్న ప్రేక్షకుడు హీరోను చూసి చప్పట్లు కొట్టాలి.. విలన్ ను చూసి కోపం తెచ్చుకోవాలి.. హీరో గెలిస్తే ఆనందపడాలి. ఇదంతా కామనే. కానీ ప్రేక్షకుల్లో ఆ ఫీలింగ్స్ రావడానికి దర్శకుల ప్లాన్లు ఇప్పుడు చర్చకు వస్తున్నాయి. ముఖ్యంగా మాస్ సినిమా అంటే వైలెన్స్ ఎక్కువగా ఉండాలనే ఆలోచన కనిపిస్తోందా అనే ప్రశ్న వినిపిస్తోంది. స్టోరీలో ట్రైంత్ కంటే వైలెన్స్ కే ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తున్నారా అనే డౌట్ కూడా వస్తోంది. ఒకప్పుడు హీరో ఎంట్రీ అంటేనే థియేటర్ లో సందడి కనిపించేది. హీరో నడిచొచ్చే తీరు, చెప్పే డైలాగ్స్, అతడి ధైర్యం ఆకట్టుకునేవి. ఇప్పుడు కూడా అలాంటి సీన్లు వస్తున్నాయి. అయితే కొన్ని మూవీస్ లో హీరోను గొప్పగా చూపించాలంటే చుట్టూ జరిగే వైలెన్స్ ను ఫుల్ గా పెంచుతున్నారు. విలన్ ఎంత చెడ్డవాడో చెప్పడానికి లిమిట్స్ క్రాస్ చేస్తున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. దీంతో అసలు కథ కంటే ఆ సీన్స్ గురించే ఎక్కువ చర్చ జరుగుతోంది. అయితే ప్రేక్షకులకు కోపం తెప్పించడం వేరు.. వారిని స్టోరీలో ఇన్వాల్వ్ చేయడం వేరు. స్క్రీన్ పై జరిగే ప్రతి ఇన్సిడెంట్ ప్రేక్షకుడికి కనెక్ట్ కావాలంటే దాని వెనుక సరైన రీజన్ ఉండాలి. కేవలం షాక్ ఇవ్వాలనే ఉద్దేశంతో సన్ని వేశాలు పెడితే అవి కాసేపు మాత్రమే ఆశ్చర్య పరచవచ్చు. కానీ సినిమా పూర్తయ్యాక మనసులో నిలిచిపోతాయని చెప్పలేం. నిజానికి ప్రేక్షకులను కదిలించడానికి పెద్ద పెద్ద సీన్లే అవసరం లేదు. ఒక రోల్ కు ఎదురైన కష్టం, ఆ పాత్ర తీసుకునే నిర్ణయం, తన వాళ్ల కోసం చేసే ప్రయత్నం స్ట్రాంగ్ ఎమోషన్స్ ను షేర్ చేయగలవ్. కథలోని బాధ ప్రేక్షకుడికి అర్థమైతే హీరోపై అభిమానం పెరుగుతుంది. అతడు చేసే పోరాటానికి అర్థం కనిపిస్తుంది. అదే లేకుండా వరుసగా ఫైట్లు చూపిస్తే సినిమాలో జోష్ ఉందని అనిపించినా, కథలోని అసలు విషయం వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉంది. 'రౌడీ అల్లుడు 2.0' ఫిక్షన్ కథను జోడించి సీక్వెల్ తీస్తే! అయితే మాస్ సినిమాలకు వైలెన్స్ అవసరమయ్యే సందర్భాలు ఉంటాయి. ప్రేక్షకులు కూడా అలాంటి సీన్స్ ఆస్వాదిస్తారు. కానీ ఎంత చూపించాలి, ఎక్కడ ఆపాల నేది దర్శకుడి ఆలోచనపై ఆధారపడి ఉంటుంది. కథకు అవసరం లేని విషయాలు కూడా చేరితే అసలు యూజ్ ఉండదు. మరోవైపు, ప్రేక్షకులు ఇప్పుడు ఎన్నో రకాల కథలు చూస్తున్నారు. కొత్తగా చూపించాలంటే వైలెన్స్ పెంచడమే సొల్యూషన్ కాదు. కథలో కొత్తదనం, పాత్రల్లో స్ట్రెంత్, డైలాగ్స్ పదును ఉంటే కూడా సినిమా స్పెషల్ గా నిలుస్తుంది. హీరోను ఎలివేట్ చేయడానికి వైలెన్స్ కాకుండా పర్సనాలిటీ యూజ్ చేయవచ్చు. అందుకే మాస్ సినిమా అంటే పెద్ద ఫైట్లు, వైలెన్స్ మాత్రమే కాదు. ప్రేక్షకుడిని నవ్వించాలి, బాధ పెట్టాలి, ఉత్సాహపరచాలి. సినిమా అయిపోయాక కూడా కొన్ని సీన్స్ గుర్తుండిపోవాలి. ఇవన్నీ చేయగలిగితేనే ఆ సినిమా ప్రేక్షకులకు దగ్గరవుతుంది. వైలెన్స్ ఎంత ఎక్కువగా ఉందనే దానికంటే, కథ ఎంత స్ట్రాంగ్ గా ఉందనేదే ఇంపార్టెంట్. ఆ డిఫరెన్స్ ను దర్శకులు గుర్తిస్తే మాస్ సినిమాలకు కొత్త అర్థం వస్తుంది.

ఐదు భారీ అస్త్రాలు.. 2027 బాక్సాఫీస్ దిమ్మతిరగాల్సిందే!



బాక్సాఫీస్ క్యాలెండర్ లో ఎప్పుడూ లేనంత క్రేజీ లైనప్ సిద్ధమవుతోంది. 2027లో టాలీవుడ్ నుంచి రాబోయే ఐదు భారీ పాన్ ఇండియా చిత్రాలు థియేటర్లను ఒక రేంజ్ లో షేక్ చేయబోతున్నాయి. ప్రభాస్ 'ఫౌజీ', మహేష్ బాబు 'వారణాసి', ఎన్టీఆర్ 'డ్రాగన్', మళ్లీ ప్రభాస్ 'స్పిరిట్', చివరగా అల్లు అర్జున్ 'రాకా'.. ఇలా టాప్ స్టార్లు వరుసపెట్టి తమ బాక్సాఫీస్ వేటను మొదలుపెట్టబోతున్నారు. ఒక్కో సినిమాకు మధ్య మంచి స్పేస్ దొరకడంతో, రికార్డుల ఊచకోత నాన్ స్టాప్ గా సాగడం ఖాయంగా కనిపిస్తోంది. మొదటగా హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ చేస్తున్న పీరియాడిక్ వార్ డ్రామా 'ఫౌజీ' థియేటర్లలోకి రానుంది. ఈ ఏడాది డిసెంబర్ లో రావాల్సిన ఈ సినిమా షూటింగ్ పనులు ఆలస్యం కావడంతో సమ్మర్ స్టార్టింగ్ లోకి షిఫ్ట్ అయ్యింది. ఇక ఆ తరువాత సందడి ఏప్రిల్ 7 నాటికి పీక్స్ కు చేరుతుంది. ఆ రోజున ఎస్ఎస్ రాజమౌళి, మహేష్ బాబు కాంబోలో రాబోతున్న విజువల్ వండర్ 'వారణాసి' బాక్సాఫీస్ బరిలోకి దిగుతోంది. జక్కన్న మార్క్ గ్రాండియర్ తో మహేష్ గ్లోబల్ లెవెల్ లో చేయబోయే హంగామా బాక్సాఫీస్ ను మరో స్థాయికి తీసుకెళ్లడం ఖాయం.ఆ తర్వాత జూన్ 11న యంగ్ టైగర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ క్రేజీ ప్రాజెక్ట్ 'డ్రాగన్' బాక్సాఫీస్ పై దండయాత్ర చేయనుంది. రాజమౌళి సినిమా తర్వాత దొరికిన రెండు నెలల గ్యాప్ ఈ మాస్ ఎపిక్ కు పర్ఫెక్ట్ గా కుదిరింది. నీల్ మార్క్ ఎలివేషన్స్ కు తారక్ స్క్రీన్ ప్రెజెన్స్ తోడైతే థియేటర్లు దద్దరిల్లిపోవడం ఖాయం. మాస్ ఆడియన్స్ కు కావాల్సిన సాలిడ్ ట్రీట్ ను అందించేందుకు ఈ ప్రాజెక్ట్ సరైన టైమ్ లోనే దిగుతోంది. ఇక పండగ సీజన్ రాగానే అక్టోబర్ 29న సందీప్ రెడ్డి వంగా తన పవర్ ఫుల్ కాప్ డ్రామా 'స్పిరిట్'తో బాక్సాఫీస్ ను ఊపేయబోతున్నారు. రఫ్ పోలీస్ గా ప్రభాస్ స్వాగ్ దీపావళి బాక్సాఫీస్ కు అసలైన కిక్ ఇవ్వనుంది. ఇదే సమయంలో ప్రచారంలో ఉన్న 'రామాయణ' రెండో భాగం కూడా కాస్త వెనక్కి జరిగి మంచి డేట్ చూసుకుంటే ఇంకా బెటర్. అప్పుడు స్పిరిట్ సోలోగా బాక్సాఫీస్ దగ్గర విధ్వంసం సృష్టించడానికి మరింత క్లియర్ వే దొరుకుతుంది. 'రౌడీ అల్లుడు 2.0' ఫిక్షన్ కథను జోడించి సీక్వెల్ తీస్తే! సంవత్సరం చివర్లో డిసెంబర్ కానుకగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న 'రాకా' థియేటర్లలోకి అడుగుపెట్టే అవకాశం ఉంది. పుష్ప క్రేజ్ తర్వాత బన్నీ చేస్తున్న ప్రాజెక్ట్ కావడం, దానికి అట్లీ మార్క్ కమర్షియల్ మాస్ ఎలిమెంట్స్ జత కావడంతో ఈ సినిమాపై అంచనాలు హై రేంజ్ లో ఉన్నాయి. ఇయర్ ఎండ్ సెలవులను పూర్తిగా క్యాష్ చేసుకుంటూ ఆ ఏడాదికి ఒక అదిరిపోయే ముగింపు ఇవ్వడానికి రాకా రెడీ అవుతోంది. ఈ ఐదు చిత్రాల రిలీజ్ ప్లానింగ్ చాలా క్లియర్ గా, హెల్తీ గ్యాప్ తో కనిపిస్తోంది. ఒకదాని తర్వాత ఒకటిగా పాన్ ఇండియా మార్కెట్ ను టార్గెట్ చేస్తూ వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్టులు బాక్సాఫీస్ లెక్కలను తిరగరాయడం ఖాయం. దాదాపు అన్ని సినిమాలకు 1000 కోట్ల కొట్టే స్టామినా ఉంది. సరైన ప్లానింగ్ తో ఒక్కొక్కరు థియేటర్లలోకి దిగితే, వచ్చే ఏడాది భారతీయ సినీ చరిత్రలోనే టాలీవుడ్ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించడం పక్కా.

పెయలు పోతున్న అందాల తృప్తి

యానిమల్ సినిమాతో పాన్ ఇండియా స్టార్డం దక్కించుకున్న తృప్తి డిమ్రి ప్రస్తుతం ప్రభాస్‌కి జోడీగా 'స్పిరిట్' సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. స్పిరిట్‌తో పాటు ఈ అమ్మడి చేతిలో అరడజను సినిమాలు ఉన్న విషయం తెల్సిందే. వరుసగా సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్‌గా ఉంటుంది. అంతే కాకుండా ఖాళీ సమయంలో విదేశాల్లో ట్రిప్స్ ను ఎంజాయ్ చేయడం మనం సోషల్ మీడియాలో చూస్తూనే ఉంటాం. తాజాగా ఈ అమ్మడు లాస్ ఏంజిల్స్ వీధుల్లో తిరుగుతూ ఉన్న ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రతిసారి విభిన్నమైన ఔట్ ఫిట్‌ను ధరించి, అందరి చూపు తనవైపుకు తిప్పుకునే ఈ అమ్మడు తాజాగా మరోసారి ఆకట్టుకునే ఫోటో షూట్‌తో మెప్పించింది. తృప్తి డిమ్రి యొక్క అందాల ఆరబోత ఫోటోలు ఎప్పటిలాగే సోషల్

మీడియాలో వైరల్ అవుతున్నాయి. లాస్ ఏంజిల్స్ వీధుల్లో తృప్తి డిమ్రి... తృప్తి అక్కడి వీధుల్లో తిరుగుతూ చిల్ అవుతున్న ఈ ఫోటోలకు పాజిటివ్ కామెంట్స్ వస్తున్నాయి. సాధారణంగా చాలా మంది హీరోయిన్స్ ఇలాంటి ఫోటోలను షేర్ చేసిన సమయంలో విమర్శలు ఎదుర్కొంటూ ఉంటారు. ఇలా వీధుల్లో తిరుగుతూ కూడా ఫోటోలు దిగి, షేర్ చేయాలా అంటూ కొందరు కామెంట్స్ చేయడం జరుగుతుంది. అయితే తృప్తికి మాత్రం పాజిటివ్ కామెంట్స్ వస్తున్నాయి. చాలా అందంగా ఉన్నారు. స్పిరిట్ సినిమాలోనూ ఇలాగే కనిపిస్తే చూడాలని ఉంది అంటూ చాలా మంది కామెంట్ చేయడం చూడవచ్చు. మొత్తానికి తృప్తి డిమ్రి ఏం చేసినా, ఎక్కడ ఉన్నా అందరి దృష్టిని ఆకర్షిస్తూ, అందరిని తన వైపుకు తిప్పుకుంటూ ఉంది. సినిమాలతో కంటే ఎక్కువగా ఈ అమ్మడు సోషల్ మీడియాలోని ఫోటోలు, వీడియోలు షేర్ చేయడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంటుంది అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు. స్పిరిట్ సినిమాతో వరుసగా... ఇక ఈ అమ్మడి సినిమాల విషయానికి వస్తే.. ఈ ఏడాదిలో ఇప్పటికే రెండు సినిమాలతో వచ్చిన విషయం తెల్సిందే. ప్రస్తుతం కొన్ని సినిమాలు చర్చల దశలో ఉంటే, కొన్ని సినిమాలు షూటింగ్ దశలో ఉన్నాయి. అన్ని అనుకున్నట్లుగా జరిగితే వచ్చే ఏడాదిలో ఈ అమ్మడు నటించిన మూడు నాలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇప్పటి వరకు ప్రకటించని సినిమాలు కూడా రెండు మూడు ఉన్నాయి. వాటి షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. స్పిరిట్ సినిమాపై ఈమె చాలా ఆశలు పెట్టుకుంది. వచ్చే ఏడాదిలో స్పిరిట్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్న దర్శకుడు సందీప్ వంగ ఈ సినిమాతో ఆమెకు స్టార్డం తెచ్చి పెట్టడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. దీపికా పదుకునే ప్లేస్ లో తృప్తిని సందీప్ ఎంపిక చేయడం జరిగింది. కనుక కచ్చితంగా తృప్తి కోసం బెస్ట్ పాత్రను సందీప్ రాసి ఉంటాడనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. బాలీవుడ్‌లో తృప్తి డిమ్రి సినిమాలు...

బాలీవుడ్‌తో పాటు సౌత్ లోనూ ఈ అమ్మడికి మంచి డిమాండ్ ఉంది. అయితే బాలీవుడ్ సినిమాల్లో మాత్రమే నటించాలని ఈమె కోరుకుంటున్నట్లుగా తెలుస్తోంది. బాలీవుడ్ నుంచి బయటకు రావడానికి కాస్త సమయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం స్పిరిట్ పై ఆశలు పెట్టుకున్న ఈ అమ్మడు రాబోయే రోజుల్లో బాలీవుడ్‌లో స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు ఉన్నాయి. అయితే ఈమెను బాలీవుడ్‌కి చెందిన ఒక హీరోయిన్ కాంపౌండ్ వారు డీ గ్రేడ్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వారు ప్రతి విషయంలోనూ తృప్తిని టార్గెట్ చేసి విమర్శలు చేసే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు ఆ మధ్య వినిపించాయి. ఇప్పుడు తృప్తి పై నెగిటివిటీ కాస్త తగ్గినట్లుగా అనిపిస్తుంది. స్పిరిట్ సినిమా తర్వాత బాలీవుడ్‌లో ఈమె బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అదే సమయంలో టాలీవుడ్‌లోనూ ఈమె స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు దక్కించుకోవచ్చు.

మృణాల్ కోరుకుంటోన్న కింగ్ ఆఫ్ రొమాన్స్ ఛాన్స్ ఎవరిదో?

మృణాల్ ఠాకూర్ ఇంతవరకూ ఎవరితోనూ ప్రేమలో పడలేదు. రిలేషన్ షిప్ లో ఉన్నట్లు కథనాలు ఎక్కడా రాలేదు. అమ్మడు దృష్టి అంతా సినిమాలపైనే ఉంది. అందులోనే తాను నటించే సినిమా ఏదైనా? వినూత్నంగా ఉండాలి. అందులోనూ అమ్మడి పాత్ర రెగ్యులర్ హీరోయిన్ పాత్రలకు భిన్నంగా ఉండాలి. వృత్తి పట్ల ఇంత ప్రొఫెషనల్ గా ఉన్న మృణాల్ వ్యక్తిగత జీవితంలో..అందులోనూ జీవిత భాగస్వామి విషయంలో ఇంకెంత జాగ్రత్తగా...ఫ్యాషనేట్ గా ఉంటుందన్నది చెప్పాల్సిన పనిలేదు. మరి మృణాల్ మనసు దోచుకునే చెలికాడు ఎవరు? అతడు ఎలా ఉండాలి? అంటే అమ్మడి మాటల్ని బట్టి ఓ క్లారిటీ వస్తుంది. జీవిత భాగస్వామి షారూక్ ఖాన్ సినిమాల్లోని రొమాంటిక్ పాత్రల వలె ఉండాలని.. అప్పుడే తాను ప్రేమకు, పెళ్లికి ఓకే చెబుతానని ఓ కామెంట్ విసిరింది. షారుక్ ఖాన్ అంటే నటుడు మాత్రమే కాదు. ఆయన ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది హృదయాలలో -కింగ్ ఆఫ్ రొమాన్స్-. షారూక్ ఖాన్ తెరపై కనిపించిన తీరు.. పలికించిన హావభావాలు.. హీరోయిన్లను ప్రేమించే విధానం ఎవరినైనా కట్టిపడేస్తాయి.్ -దిల్ వాలే దుల్హానియా లే జాయేంగే- నుంచి -దిల్ తో పాగల్ హై-, -వీర్-జారా- వరకు షారుక్ పోషించిన ప్రతి రొమాంటిక్ పాత్ర భావోద్వేగ ప్రయాణం. కళ్లతోనే ప్రేమను పలికించడం, చేతులు చాచే సిగ్నేచర్ పోజ్, ప్రియురాలి కోసం ఎంతకైనా వెళ్లే తత్వం ఇవన్నీ షారూక్ పాత్రల ప్రత్యేకత. నేటి మోడరన్ డేట్స్‌లో ఇలాంటి అరుదైన, స్వచ్ఛమైన ప్రేమను కోరుకోవడంలో మృణాల్ ఆలోచనలో ఎంతటి నిజాయితీ ఉందో అర్థమవుతుంది. మృణాల్ ఠాకూర్ సినిమాల్లో అందమైన అభినయంతో పాటు, పాత్రలకు తగ్గ లోతైన ఎమోషన్స్‌ను పండించడంలో దిట్ట. నిజ జీవితంలో కూడా మృణాల్ రిలేషన్‌షిప్స్, ప్రేమ పట్ల చాలా క్లారిటీతో ఉన్నారని తెలుస్తోంది. తాత్కాలిక ఆకర్షణల కంటే షారూక్ సినిమాల్లో చూపించే అంకితభావం, నిస్వార్థమైన ప్రేమ, గౌరవం భాగస్వామిలో ఉండాలని భావిస్తున్నట్లు కనిపిస్తుంది. ప్రాక్టికల్ రిలేషన్‌షిప్స్ పెరుగుతున్న తరుణంలో మృణాల్ ఇప్పటికీ ఆ క్లాసిక్, మ్యాజికల్ లవ్‌ను నమ్మడం విశేషం. బాలీవుడ్ నుంచి సౌత్ సినిమా వరకు తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మృణాల్, సెలబ్రిటీ హోదాను పక్కన పెట్టి సాధారణ అమ్మాయిలా కలల రాకుమారుడి గురించి మాట్లాడటం అభిమానులను ఆకట్టుకుంటోంది. షారూక్ రొమాన్స్ కేవలం కల్పన కాదని.. అది నిజ జీవితంలో కూడా ఎదుటివారికి ఇచ్చే భద్రతకు, ప్రేమకు ప్రతీక అని నమ్ముతున్నట్లు తెలుస్తోంది. ఇండస్ట్రీలో మారుతున్న సమీకరణాల మధ్య మృణాల్ స్పష్టమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం అమ్మడి పరిణతికి నిదర్శనం. మరి మృణాల్ కోరుకుంటోన్న ఆ కింగ్ ఆఫ్ రొమాన్స్ వెండి తెర హీరో అవుతాడా? బిజినెస్ మెన్ అవుతాడా? అన్నది విధికే వదిలేయాలి.



టాలీవుడ్ లో జాన్వీ దూకుడు తగ్గినట్లేనా?



అతిలోక సుందరి శ్రీదేవి తనయగా ఇండియన్ సినిమాలో అడుగుపెట్టిన జాన్వీ కపూర్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఓ రేంజ్‌లో హడావుడి చేసింది. సౌత్ ఇండియన్ ఆడియన్స్ ప్రత్యేకించి తెలుగు సినీ ప్రియులు శ్రీదేవిపై ఉన్న అభిమానంతో జాన్వీకి ఘన స్వాగతం పలికారు. అగ్ర హీరోల పక్కన గ్రాండ్ కాంబినేషన్లతో అడుగుపెట్టిన ఈ బాలీవుడ్ బ్యూటీ టాలీవుడ్ ని ఏలడం ఖాయమని భావించారు. కానీ ఆరంభంలో కనిపించిన అంచనాలు, ఊపు క్రమంగా తగ్గిపోతున్నాయా? తెలుగునాట జాన్వీ గ్రాఫ్ మెల్లగా పడిపోతోందా? అనే చర్చ ఫిలిం నగర్ వర్గాల్లో మొదలైంది. -ఆర్ఆర్ఆర్- లాంటి గ్లోబల్ హిట్ తర్వాత మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ సరసన -దేవర- చిత్రంతో జాన్వీ కపూర్ టాలీవుడ్ అరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ ప్రాజెక్ట్‌లో జాన్వీ హీరోయిన్‌గా నటించడంతో ఆమెపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ సినిమా ప్రమోషన్లలో పాటల్లో జాన్వీ చూపించిన గ్లామర్, శ్రీదేవిని గుర్తుచేసేలా ఉందంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపించారు. ఎన్టీఆర్ కాంబినేషన్ వల్ల సౌత్‌లో వరుసగా స్టార్ హీరోల పక్కన ఆఫర్లు వెల్లువెత్తుతాయని విశ్లేషకులు భావించారు. -దేవర- తర్వాత మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన -పెద్ది-లోనూ మెరిసింది. ఈ సినిమా బాగానే ఆడింది. ఇలా ఆరంభంలోనే ఎన్టీఆర్, రామ్ చరణ్ వంటి పాన్ ఇండియా స్టార్లతో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు ఓకే చేసి సంచలనం సృష్టించిన ఆ తర్వాత కొత్తగా ఏ తెలుగు ప్రాజెక్ట్‌కి సంతకం చేయకపోవడం ఆమె దూకుడు తగ్గింద నడానికి సంకేతంగా కనిపిస్తోంది. టాలీవుడ్‌లోని ఇతర యంగ్ హీరోలు లేదా మీడియం రేంజ్ స్టార్ల సినిమాల్లో ఆమె నటించేందుకు మొగ్గు చూపకపోవడం.. మరోవైపు స్టార్ హీరోల సినిమాల్లో లేడీ ఓరియంటెడ్ లేదా ప్రాధాన్యత ఉన్న పాత్రలు లభించకపోవడం వల్ల జాన్వీ సైలెంట్ అయినట్లు తెలుస్తోంది. అయితే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటిస్తోన్న -రాకా-లో నటిస్తోంది. కానీ అందులో హీరోయిన్ దీపిక నటిస్తుండగా...ఓ కీలక పాత్రలో మాత్రమే జాన్వీ మెరుపులు కనిపించనున్నాయి. దీంతో -రాకా- తో జాన్వీకి పెద్దగా ఒరిగేదేమి ఉండదు. మరోవైపు టాలీవుడ్‌లో పోటీ రోజురోజుకు తీవ్రమవుతోంది. మృణాల్ ఠాకూర్, రష్మిక మందన్న వంటి భామలు వరుసగా హిట్ సినిమాలతో టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద జెండా పాతేస్తున్నారు. గ్లామర్‌కే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ టాలీవుడ్ మేకర్స్‌కు బెస్ట్ ఆప్షన్‌గా మారుతున్నారు. ఈ పోటీని తట్టుకుని జాన్వీ నిలబడటం కష్టమే అన్న మాట వినిపిస్తోంది. మరి ఈ ఫేజ్ ను దాటి జాన్వీ టాలీవుడ్ తదుపరి అడుగు ఎలా ఉంటుందన్నది చూడాలి.

Printed by M/s Sri Venkataramana Offset Printers Published by Syed Tajbaba on behalf of Syed Tajbaba,
Printed at Peddapalli and published at B-12 Ntpc Ramagundam,Editor SYED TAJBABA.